ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేద్కర్

కోనసీమ జిల్లా వార్తలు

రంజాన్ వేళలు — ఇఫ్తార్ (గురు) సా.6.20 — సహరి (శుక్ర) ఉ.4.56

తొలిసారిగా పదోతరగతి హాల్ టిక్కెట్లు వాట్సాప్ ద్వారా డౌన్లోడ్ 7

కాకినాడలో మీను పుట్టినరోజు వేడుకలు

7



సినీనటి మీనాక్షిచౌదరి తన పుట్టినరోజు వేడుకలు గురువారం కాకినాడలో నిర్వహించుకున్నారు. ఓ కార్యక్రమం నిమిత్తం కాకినాడ వచ్చిన ఆమె తన జన్మదినం సందర్భంగా స్థానిక పరివర్తన పాఠశాల విద్యార్థులతో కాసేపిలా గడిపారు..

ఇంటర్ పరీక్షలకు 468మంది గైర్హాజరు

» జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సోమశేఖరరావు

అమలాపురం టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బుధవారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీషు పరీక్షకు 468మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. జనరల్ విద్యార్థులు 9,985మందికిగాను 9668మంది హాజరు కాగా 317మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 2347మంది విద్యార్థులకుగాను 2196మంది హాజరుకాగా 151మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదని తెలిపారు. జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను స్క్వాడ్‌లు ఆకస్మికంగా తనిఖీ చేశాయన్నారు.

మహిళా ఉద్యోగుల క్రీడా పోటీలు ప్రారంభం



మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి తూర్పు జిల్లా ఏపీఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో 100 మీటర్ల పరుగు పందేన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

6

రయ్..రయ్..



సామర్లకోట- వేమగిరి కెనాల్ రోడ్



రామచంద్రపురం- కరప - కాకినాడ రోడ్డు

» ఉమ్మడి తూ.గో. జిల్లాలో పీపీపీ విధానంలో రహదారుల అభివృద్ధి
» కాకినాడ-జొన్నాడ, కాకినాడ-రాజమహేంద్రవరం కెనాల్ రోడ్ల ఎంపిక
» వీటిని పీపీపీ విధానంలో అభివృద్ధికి నిర్ణయం
» సాధ్యాసాధ్యాలపై డీపీఆర్‌ల తయారీ బాధ్యత ఎల్ఎన్ మాలవ్య సంస్థకు అప్పగింత
» ఈ రోడ్లపై వాహన రద్దీ, ఎంత కాలానికి పీపీపీ అనేదానిపై ఏడాదిలో అధ్యయన నివేదిక
» కాకినాడ-జొన్నాడ రహదారి అభివృద్ధికి రూ.225 కోట్లు ఖర్చవుతుందని అంచనా
» కరప, వేళంగి, ఆలమూరు, మండపేటలలో బైపాస్‌లు నిర్మాణంతో భారీగా పెరగనున్న ఖర్చు
» అటు కెనాల్ రోడ్డు అభివృద్ధికి రూ.160 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా
» అన్నీ కుదిరితే వచ్చే ఏడాదే ఈ రహదారుల నిర్మాణానికి టెండర్లు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అత్యంత కీలకమైన కాకినాడ-జొన్నాడ, కాకినాడ-రాజమహేంద్రవరం కెనాల్ రహదారులకు మంచి రోజులు రాబోతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఈ రెండు రహదారులపై నిత్యం వేలల్లో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. తీరా ఇవి అత్యంత ఇరుకైన రహదారులు కావడంతో నిత్యం ట్రాఫిక్ నరకంతోపాటు ప్రయాణ సమయం చాలా ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో ఈ రెండింటిని పీపీపీ విధానంలో అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. వీటి సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసి నివేదిక తయారుచేసే బాధ్యతను తాజాగా ఎల్ఎన్ మాలవ్య కంపెనీకి అప్పగించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు పట్టణాలు, నగరాలు, జాతీయ రహదారిని కలిపే అనేక కీలక రహదారులు గడచిన అయిదేళ్లలో పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఏమాత్రం అభివృద్ధికి నోచుకోక ప్రయాణి కులకు నరకం చూపిస్తున్నాయి. ఒకపక్క భారీ గుంతలు పడ్డా గత వైసీపీ సర్కారు వీటిని గాలికి వదిలేసింది. దీంతో ప్రజలు పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక రహదారులను కోట్లు ఖర్చుచేసి మరమ్మతులు చేసింది. అయితే వీటిలో అత్యంత కీలకమైన రోడ్లను మాత్రం పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని, వీటికయ్యే ఖర్చును ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా భరించాలని నిర్ణయించింది. ఇందుకోసం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెండు రహదారులను ఎంపిక చేసింది. వీటిలో ఒకటి కాకినాడ-జొన్నాడ, మరొకటి కాకినాడ-రాజమహేంద్రవరం కెనాల్ రోడ్డు. 62 కిలోమీటర్ల పొడవున్న కాకినాడ- జొన్నాడ రహదారి ఉమ్మడి జిల్లాలో అత్యంత కీలకం. కాకినాడ జిల్లా నుంచి కోనసీమ జిల్లాకు అనుసంధానించే ఈ రహదారి ద్వారా రావులపాలెం జాతీయ రహదారికి చేరుకోవచ్చు. అయితే ఈ రోడ్డు కాకినాడ నగరం నుంచి కరప, వేళంగి, రామచంద్రపురం, మండపేట, ఆలమూరు మీదుగా వెళ్తుంది. నిత్యం ఈ రోడ్డు భారీగా రద్దీగా ఉంటుంది. రావులపాలెం, విజయవాడ, హైదరాబాద్ వెళ్లే బస్సులు, కార్లు, ఇతర లారీలన్నీ ఈ దారి మీదుగానే ప్రయాణిస్తాయి. కానీ ఎన్నో ఏళ్ల కిందట నిర్మించిన ఈ రహదారి ఇప్పుడున్న ట్రాఫిక్‌ను ఏమాత్రం తట్టుకోలేని విధంగా మారింది. రోడ్డు ఎక్కడికక్కడ చాలా చిన్నది కావడంతో వచ్చీపోయే వాహనాలకు ఏమాత్రం సరిపోవడం లేదు. ఈ ఆర్అండ్‌బీ రహదారిని పీపీపీ విధానంలో భారీస్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అటు 50 కిలోమీటర్ల పొడవు న్న కాకినాడ-రాజమహేంద్రవరం కెనాల్ రోడ్డు సైతం ఈ రెండు నగరాలను కలిపే కీలక రహదారి. ఒక రకంగా ఏడీబీ రోడ్డుతో పోల్చితే కెనాల్ రోడ్డు ద్వారా రెండు నగరాల మధ్య దూరం తక్కువ. ప్రస్తుతం లారీలు, కార్లు, బస్సులు ఇతర వాహనాలన్నీ ఈ రోడ్డుపై నుంచే వెళ్తున్నాయి. మధ్యలో అనేక గ్రామాలు, పట్టణాలు ఉండడంతో ట్రాఫిక్ దారుణంగా ఉంటోంది. రహదారి చాలా ఇరుగ్గా ఉండడంతో నిత్యం నరకమే. దీంతో దీన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.

వచ్చే ఏడాదిలోగా పనులు..

ఈ రెండు రహదారులను పీపీపీ విధానంలో భారీగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటి నిర్మాణ సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయించడానికి సిద్ధమైంది. ఈమేరకు ప్యాకేజీ 3 కింద డీపీఆర్ తయారీ బాధ్యతలు అప్పగించడానికి టెండర్లు పిలిచింది. వీటిని తాజాగా మధ్యప్రదేశ్‌కు చెంది ఎల్ఎన్ మాలవ్య సంస్థ ఈ కాంట్రాక్టు దక్కించుకుంది. త్వరలో ఈ రెండు రహదారుల అభివృద్ధి ఈ కంపెనీ పూర్తిస్థాయి నివేదిక తయారు చేయనుంది. అందులోభాగంగా ఈ రోడ్లను అభివృద్ధి చేసే విషయంలో సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయనుంది. ఆయా రోడ్లపై వాహనరద్దీ ఎంత ఉంది అనేదానిపై కొంతకాలం పరిశీలించనుంది. ఈ రోడ్లను అభివృద్ధి చేస్తే ఎంత కాలానికి పీపీపీ విధానంలో కాంట్రాక్టర్‌కు అప్పగించవచ్చు.. టోల్ వసూలెంత చేయాల్సి ఉంటుంది.. రహదారిని నిర్మించిన తర్వాత టోల్ ద్వారా కాంట్రాక్టర్‌కు వెచ్చించినంత మొత్తం రాకపోతే ప్రభుత్వం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ ద్వారా ఎంత చెల్లించాలి? తదితర అంశాలపై డీపీఆర్‌లో ఈ కంపెనీ వివరించనుంది. ఈ నివేదికను వచ్చే ఏడాది ఈ సంస్థ ప్రభుత్వానికి అప్పగించనుంది. ఆ తర్వాత రోడ్లను విస్తరించి కొత్తగా నిర్మించడానికి టెండర్లను పిలవనుంది. కాకినాడ-జొన్నాడ రహదారిలో ఇప్పటికే పలు పట్టణాలు, గ్రామాలు భారీగా విస్తరించినందున నాలుగులేన్ల కొత్త రహదారి అభివృద్ధికి భూములు, ఇళ్లు సేకరించాల్సి వస్తుందని, అదే జరిగితే ఖర్చు భారీగా ఉంటుందని అంచనాకు వచ్చారు. ఈనేపథ్యంలో కరప, వేళంగి, మండపేట, ఆలమూరు మీదుగా కొత్తగా బైపాస్‌లు నిర్మించాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఇందుకు రూ.225కోట్ల వరకు ఖర్చయ్యే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు. అలాగే కెనాల్ రోడ్డుకు సైతం నాలుగు రహదారులు నిర్మించాల్సి రావడం, అటు అనపర్తి, వేమగిరి పట్టణాల మీదుగా రహదారి వెళ్తుండడంతో వీటిని బైపాస్ చేస్తూ కొత్తగా రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఉంది. అలాగే కేశవరం,వేట్లపాలెం, బ్రహ్మదేవం ప్రాంతాల్లో కాలువ, రైల్వే ట్రాక్, రోడ్డు పక్కపక్కనే ఉన్నాయి. ఈనేపథ్యంలో వీటి వద్ద కూడా బైపాస్ అవసరం. మిగిలిన రహదారి వెంబడి కాలువ ఉండడంతో భూసేకరణకు పెద్దగా ఖర్చు కాదు. అయితే ఈరోడ్డును అభివృద్ధి చేయాలని ఇప్పటికే కూటమి అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబును కలిపి అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పలు దఫాలుగా వినతిపత్రం అందించారు. దీంతో పీపీపీ విధానంలో ఈ రోడ్డు చేర్చారు. అయితే కెనాల్ రోడ్డుకు రూ.160 కోట్ల కంటే ఎక్కువ వ్యయం అవుతుందని అధికారులు అంచనాకు వచ్చారు.

నిరుద్యోగుల్లో.. చిగురిస్తున్న ఆశలు

» రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వర్క్‌ఫ్రం హోం సర్వే



అమలాపురం మండలం కామనగరువులో సర్వే నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు

అమలాపురం రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూలేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం వర్క్ ఫ్రం హోం సర్వేను చేపట్టింది. జిల్లాలో ఎంతమంది నిరుద్యోగులు ఉన్నారు. ఎంతవరకు చదువుకున్నారు. ఏ తరహా ఉద్యోగానికి వెళ్లాలనుకుంటున్నారో తదితర వివరాలను సర్వే బృందం సేకరిస్తోంది. ప్రభుత్వం ఆదేశాల మేరకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పర్యవేక్షణలో గ్రామ, వార్డు సచివాలయశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో సర్వేను శరవేగంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 8వతేదీ నాటికి సర్వే పూర్తి చేసి సమగ్ర నివేదికను ప్రభుత్వానికిఅందించేందుకు కలెక్టర్ స్వయంగా ప్రత్యేక కార్యాచరణను రూపొందించి అమలు చేస్తున్నారు. సచివాలయ ఉద్యోగుల సెలవులను సైతం రద్దు చేసి ప్రతి ఉద్యోగి కచ్చితంగా రోజుకు 40మంది నిరుద్యోగుల వివరాలు సేకరించేలా పని విభజన చేశారు. సుదూర ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగులను సైతం గణించేలా సంబంధిత కుటుంబసభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ఐటీ సెక్టార్‌లో ఇప్పటికే వర్క్ ఫ్రం హోమ్ చేస్తున్నవారి వివరాలను సైతం నమోదు చేస్తున్నారు. ఇంటింటికీ తిరిగి వారి విద్యార్హతను బట్టి ఏ తరహా ఉద్యోగం చేయాలనుకుంటున్నారో అడుగడంతో పాటు శిక్షణ తీసుకుంటారా అని అడిగి ఆయా వివరాలను నమోదు చేస్తుండడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

జిల్లాలో 4.21 లక్షల గృహాల్లో సర్వే..

వర్క్‌ఫ్రం హోమ్ సర్వేలో భాగంగా జిల్లాలోని 4,21,091 గృహాల్లో ఉన్న చదువుకున్న నిరుద్యోగులు 9,21,625మందిని సర్వే చేయనున్నారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాలవారీగా జరిగిన సర్వేలో కోనసీమ జిల్లా మూడోస్థానంలో ఉంది. 18 నుంచి 50 ఏళ్ల లోపు వయసున్నవారి విద్యార్హత సమాచారంతో ఆయా సచివాలయాలకు జాబితాలు చేరుకున్నాయి. డిప్లమో, డిగ్రీ, ఇంజనీరింగ్‌తో పాటు ఉన్నత చదువులు పూర్తి చేసినవారిలో గృహిణులు కూడా ఉన్నారు. సచివాలయ సిబ్బంది ఫోన్‌లో ఆయా అభ్యర్థుల వివరాలను నమోదు చేసి వేలిముద్ర గానీ, ఐరిష్‌గానీ తప్పనిసరిగా తీసుకుంటున్నారు. తద్వారా సమగ్ర సర్వేలో భాగంగా వారి విద్యార్హతలను బట్టి వర్క్ ఫ్రం హోం కింద ఏ తరహా ఉద్యోగాలు, పనులు చేయాలనుకుంటున్నారో అడిగి తెలుసుకుని నమోదు చేస్తున్నారు. ప్రభుత్వం అందించే శిక్షణకు హాజరవుతారా అని అడుగుతున్నారు. ప్రభుత్వమే ఇళ్ల వద్దకు వచ్చి వివరాలు సేకరిస్తుండడంతో నిరుద్యోగుల ఆనందానికి అవధుల్లేవు. ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసుకున్న అభ్యర్థులైతే ఇప్పటికే ఐటీ సెక్టార్‌లో వర్క్‌ఫ్రం హోమ్‌ను ప్రోత్సహిస్తామని చెప్పడంతో వారు తమకు ఏదో ఒక ఉద్యోగం ఐటీ సెక్టార్‌లో వస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ సిబ్బంది ఉదయం నుంచి రాత్రి వరకు వర్క్ ఫ్రం హోమ్ సర్వేను నిర్వహిస్తున్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించే సమావేశం నాటికి సర్వే నివేదికలు సిద్ధం చేసే దిశగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. సర్వేను జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి, డీఎల్పీవో పి.బొజ్జిరాజు పర్యవేక్షిస్తున్నారు.

సర్వేలో భాగంగా..

విద్యార్హతలను బట్టి వారు ఏవిధమైన శిక్షణ కోరకుంటున్నారో ఏ తరహా ఉద్యోగాలు చేయాలనుకుంటున్నారో నమోదు చేసుకున్నారు. ఐటీ సెక్టార్‌లో వర్క్ ఫ్రం హోం కింద ఏ తరహా ఉద్యోగం కోరుకుంటున్నారో వారి ఇంటికి బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ ఉందా లేదా దాని స్పీడు ఎంత తదితర వివరాలను నమోదు చేస్తున్నారు. వర్క్ ఫ్రం హోమ్ ఉద్యోగం చేసుకోవడానికి ఇంట్లో ప్రత్యేక గది ఉందా లేదా నమోదు చేస్తున్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీతోపాటు ఐటీ ఎలక్ట్రికల్ సర్వీసెస్ చదువుకున్నవారి నుంచి ప్రత్యేకంగా వివరాలను నమోదు చేస్తున్నారు. త్వరలోనే మంచి నిర్ణయాన్ని ప్రభుత్వం ప్రకటిస్తుందనే ఆశాభావం నిరుద్యోగుల్లో వ్యక్తమవుతోంది.

నేడు గీత కులాలకు మద్యం షాపుల కేటాయింపు

అమలాపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కులాలకు సంబంధించి ప్రభుత్వం జిల్లాకు 13 మద్యం షాపులను కేటాయించిందని ఎక్సైజ్‌శాఖ జిల్లా అధికారి ఎస్కేడీవీ ప్రసాద్ తెలిపారు. శెట్టిబలిజ కులానికి 12, గౌడ కులస్తులకు ఒక షాపును కేటాయించారు. మొత్తం 13 మద్యం షాపులకు 261 దరఖాస్తులు అందాయన్నారు. ఆయా మద్యం షాపులకు లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. గురువారం ఉదయం 11 గంటలకు కలెక్టర్ కార్యాల ప్రాంగణంలోని గోదావరి భవనంలో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సమక్షంలో మద్యం షాపుల లాటరీ చేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తుదారులు ఉదయం 10 గంటలకు గోదావరి భవన్‌కు హాజరుకావాలని కోరారు.

మహిళా దినోత్సవంలో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలి

» కార్యక్రమం ఘనంగా నిర్వహించాలి
» కలెక్టర్ మహేష్‌కుమార్



అమలాపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జిల్లాస్థాయిలో అధికారులు సమిష్టి భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ముఖ్య కార్యదర్శి సూర్యకుమారి అమరావతినుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టరేట్ నుంచి తొలుత ఆయన పాల్గొన్నారు. అనంతరం అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ మహిళా సాధికారిత, మహిళల రక్షణ, భద్రత సంక్షేమంకోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాల లబ్ధిదారుల జాబితాలను జిల్లా గ్రామీణాభివృద్ధి, జిల్లా పరిశ్రమలకేంద్రం మహిళా శిశు సంక్షేమ శాఖలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియామవళి అమలులో లేనందున ప్రజాప్రతినిధులను ఈ వేడుకల్లో భాగస్వాములను చేయాలని ఆదేశించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గాల వారీగా కుట్టు శిక్షణ కేంద్రాలను ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. శిక్షణకు ఆసక్తి గల మహిళలను ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లు ఎంపికచేసి శిక్షణా కేంద్రాలకు పంపించాలన్నారు. డ్వాక్రా సంఘాలు తయారుచేసిన లీడింగ్ వ్యాపారాల కోసం ఈ కామర్స్ ఆన్‌లైన్ విధానం ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్న వివరాలు, కుదుర్చుకున్న ఒప్పందాలపై నివేదికలు సిద్ధం చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖల వారీగా మహిళల సాధికారత, భద్రత సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాల నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, ఎల్డీఎం కేశవవర్మ, జిల్లా పరిశ్రమలకేంద్రం సహాయ సంచాలకుడు శివరామప్రసాద్, ఐసీడీఎస్ పీడీ శాంతికుమారి, మెప్మా పీడీ ప్రియంవద పాల్గొన్నారు.

నివేదికలు సిద్ధం చేయాలి

జిల్లాలోని వివిధ శాఖల కార్యకలాపాలకు సంబంధించిన మానవ వనరుల లభ్యత-శిక్షణ కార్యక్రమాలపై జిల్లాస్థాయి అధికారులు నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో నైపుణ్య అభివృద్ధిశాఖ జిల్లా కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. మానవ వనరుల వినియోగం, వాటికి అవసరమైన శిక్షణలను నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఇప్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలన్నారు. వ్యవసాయం, ఉద్యాన, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జిల్లా పరిశ్రమల కేంద్రం, చేనేత జౌళిశాఖ, వైద్య ఆరోగ్యశాఖ, ఏపీ ట్రాన్స్‌కో, జలవనరుల శాఖలలో మానవ వనరుల అవసరం, వాటికి సంబంధించిన నైపుణ్య శిక్షణలు అందించేందుకు 19నాటికి నివేదికలు అందించాలన్నారు. నిరుద్యోగ యువత కోసం ప్రతీనెల నియోజకవర్గాలవారీగా జాబ్ మేళాలలు నిర్వహిస్తూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంపొందించాలన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరిశేషు, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి యి.వసంతలక్ష్మి, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, ఉద్యాన అధికారి దిలీప్, పరిశ్రమల కేంద్రం సహాయ సంచాలకుడు శివరామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

రొయ్య.. రోదన!





» పడిపోయిన రొయ్యల ధరలు
» పంట చేతికివచ్చే సమయంలో.. భారీగా తగ్గుదల
» ఎగుమతిదారుల సిండికేట్‌తో రైతులు విలవిల
» పెరిగిన ఉత్పత్తి వ్యయం.. కుదేలవుతున్న ఆక్వారంగం
» నాణ్యతలేని సీడు, పెరిగిన విద్యుత్ చార్జీలు, ఫీడ్ ధరలు
» కాలుష్య కారకాలుగా మారుతున్న ఆక్వా చెరువులు
» ప్రభుత్వమే ఆక్వాను ఆదుకోవాలి : రైతుల డిమాండ్

అమలాపురం/అంతర్వేది, మార్చి5(ఆంధ్రజ్యోతి): విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించిపెట్టే ఆక్వారంగం క్రమంగా కుదేలవుతోంది. పెరుగుతున్న పెట్టుబడి వ్యయానికి తగ్గట్టు ఉత్పత్తి అయిన రొయ్యలకు సరైన లభించకపోవడంతో ఆక్వా రైతులు నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. ఎగుమతిదారులు సిండికేట్‌గా తయారై ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి అయ్యే సమయానికి ధరలను ఇష్టారాజ్యంగా తగ్గించేయడంతో ఆ రంగంపై ఆధారపడి జీవిస్తున్న వేలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనికితోడు నాణ్యతలేని రొయ్య సీడు సరఫరా, విద్యుత్ చార్జీల భారం, ఆక్వా ఫీడ్ ధరల పెరుగుదలతోపాటు ఉత్పత్తి వ్యయాలు అనూహ్యంగా పెరిగిపోతుండడంతో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లోని ఆక్వా సేద్యం చేస్తున్న రైతులు తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు. దీనికితోడు రొయ్యల చెరువుల లీజు కూడా రికార్డుస్థాయికి చేరిపోయింది. కానీ ఆక్వా పంట విక్రయించే సమయంలో మాత్రం ఎగుమతిదారులు పెట్టిందే రేటు.. వారు కొంటేనే రైతుకు దిక్కు అన్న చందంగా పరిస్థితులు మారిపోతున్నాయి. దీంతో రానున్న రోజుల్లో ఆక్వా సేద్యం గడ్డు పరిస్థితులను ఎదుర్కోనుంది. ఆక్వా సేద్యం చేస్తున్న రైతులకు రొయ్య పిల్లల సీడ్ చెరువులో వేసిన నాటి నుంచి అది పెరిగి పెద్ద అయి కౌంట్ దశకు చేరే సమయం వరకు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. గతంకంటే భిన్నంగా సాగు సమయంలో అనేక కష్టాలు పడాల్సి వస్తోంది. ఒకవైపు విపరీతంగా పెరిగిపోతున్న ఆక్వాచెరువులు. మరోవైపు కాలుష్యం కారకాలుగా ఆ ప్రాంతాలు తయారు కావడంతో చెరువుల సాగుకు అడుగడుగునా అవాంతరాలు ఎదురవుతున్నాయి. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల వల్ల రొయ్యలు, చేపలపై వివిధ రకాల వైరస్‌లు దాడి చేస్తున్నాయి. ఫలితంగా ఆ పంటలు సాగుచేస్తున్న ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనికి కారణం హేచరీల్లో నాణ్యత లేని సీడును ఉత్పత్తిచేసి మాయమాటలతో రైతులను బురిడీ కొట్టించి వాటిని సరఫరా చేయడం ద్వారా భారీ సొమ్ము చేసుకుంటున్నారు. వీటికితోడు పెరిగిన విద్యుత్ చార్జీలు, అడ్డూ అదుపులేకుండా ఆక్వాసేద్యానికి సంబంధించిన ఎరువులు, వ్యాక్సిన్లు, మేత రేట్లు పెంచి రైతుల నోట్లో మట్టి కొడుతున్నారని ఆక్వా రైతులు ఆరోపిస్తున్నారు. పంట సాగుకు వచ్చే సమయంలో ముఖ్యంగా ఆక్వారంగానికి చెందిన ఎగుమతిదారులు సిండికేట్‌గా మారి ధరలు అమాంతంగా తగ్గించడంతో పంట దిగుబడి, రొయ్య కౌంట్ ధరలపైనా ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులకు వారు ఇస్తున్న షాక్‌తో నష్టం వాటిల్లుతోంది. గతేడాది మే నెలలో వంద కౌంట్ ధర కిలో రూ.220 పలికేది. అయితే ఆ కౌంట్ సాగు చేయడానికి రూ.250 పైనే ఖర్చు అవుతుందని ఆక్వా రైతులు చెబుతున్నారు. గత ఏడాదిలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కిలో కౌంట్ రొయ్య ధర రూ.260 వరకు పెరిగింది. ఒక దశలో వంద కౌంట్ రూ.270 కూడా కొనుగోలు చేశారు. ఈ ధర కొన్ని నెలలపాటు నిలకడగా కొనసాగడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. అయితే గత కొన్ని రోజులు నుంచి క్రమంగా వీటి ధరలు తగ్గుముఖం పట్టాయి. మహాశివరాత్రి పర్వదినం నుంచి రొయ్యల ధరలు పతనం ప్రారంభమై వంద కౌంట్ ధర రూ.200కు పడిపోయింది. ఎగుమతిదారులు సిండికేట్ అయి పండుగల పేరిట రొయ్యల ధరలను తగ్గిస్తూ తమ జీవితాలతో ఆడుకుంటున్నారని ఆక్వాసాగు చేస్తున్న వందలాదిమంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆక్వా రైతులను ఆదుకోవాలి



ప్రస్తుతం ఉన్న ఆక్వా రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఎంతో ఎదురుచూశాం. అయితే ఒక్కసారిగా మూడ్రోజుల్లో రూ.30 ధర తగ్గడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. సీడులో నాణ్యత లేకపోవడం, విద్యుత్ చార్జీలు, రొయ్య మేత ధర పెంపుపై రైతులను ఎగుమతిదారులు తీవ్ర ఇక్కట్లకు గురిచేస్తున్నారు. చిన్నాపెద్దా ఆక్వా సాగు చేసుకునే రైతులకు సరైన నాణ్యత గల సీడు, సరఫరాచేసి ఉత్పత్తి సమయంలో ధరలను నిలకడగా ఉంచితే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు.

- నల్లా సత్యకిరణ్‌ప్రసాద్, ఆక్వా రైతు, అంతర్వేది

ధరల్లో రోజురోజుకు క్షీణత

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆక్వారంగ ఉత్పత్తుల ధరల పెరుగుదల చూపించినట్టే చూపి హఠాత్తుగా వాటిని తగ్గించేశారు. దాంతో ఈ ఏడాది ఫిబ్రవరి 20న ఉన్న ధరలతో పోలిస్తే మార్చి మొదటి వారంలో ఇప్పటివరకు రూ.150 తగ్గించేశారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రతీ కౌంట్‌కు కిలోకు సగటున రూ.30 వరకు ధర తగ్గించారు. ప్రతీ రైతుకు ఎకరానికి కనీసం రూ.లక్ష వరకు నష్టం వాటిల్లితున్నట్టు రైతులు వాపోతున్నారు. కాగా ఫిబ్రవరి 20న వంద కౌంట్ రూ.260 ఉండగా, 90 కౌంట్ రూ.270, 80 కౌంటు రూ.300, 70 కౌంట్ రూ.330, 60 కౌంట్ రూ.360, 50 కౌంట్ రూ.390, 40 కౌంట్ రూ.415 పలికేది. అయితే మార్చి 1వ తేదీన నుంచి 3వ తేదీ వరకు వంద కౌంట్ రూ.250 నుంచి రూ.230కి పడిపోయింది. 40 కౌంట్ రూ.400 నుంచి రూ.380కు పడిపోయింది. కానీ రైతుల నుంచి మాత్రం ఇంకా ధరలు తగ్గించి దళారులు తక్కువకు కొనుగోలు చేయడం వల్ల భారీగా నష్టపోతున్నారు.



పతకాల పూర్ణిమ

మోతుగూడెం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే మరోవైపు క్రీడల్లో రాణిస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా మోతుగూడెంలో ఏపీ జెన్‌కోలో అటెండరుగా పనిచేస్తున్న పొట్నూరి పూర్ణిమ మైదానంలో అడుగుపెడితే పతకంతోనే తిరిగొస్తుంది. ఏపీ జెన్‌కో డీఏవీ పాఠశాలలో చదువుకునే రోజుల్లోనే ఆటలపై మక్కువ పెంచుకున్నారు. తొమ్మిదో తరగతిలో ఉండగా అథ్లెటిక్స్ జోనల్, డివిజన్ స్థాయిల్లో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైంది. ఈమె తండ్రి గణేష్ పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో పనిచేసేవాడు. ఆయన ఉద్యోగంలో ఉండగానే చనిపోయారు. దీంతో తల్లికి ఉద్యోగం ఇచ్చారు. దురదృష్టవశాత్తు ఆమె కూడా చనిపోయింది. తల్లి ఉద్యోగ బాధ్యతను స్వీకరించిన పూర్ణిమ ప్రస్తుతం లోయర్ సీలేరు ప్రాజెక్టు పొల్లూరు విద్యుత్ కేంద్రంలో ప్లాంట్ అటెండర్‌గా పని చేస్తోంది. ఆమె బరిలో దిగితే ప్రత్యర్థులకు చెమటలు పట్టవలసిందే. షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో జాతీయ స్థాయిలో బంగారం పతకం గెలుచుకుంది.



సాధించిన షీల్డులతో పూర్ణిమ

ఆత్మగౌరవంతో, స్వశక్తితో ఉన్నత స్థితికి చేరుకుని 'స్త్రీ'శక్తిని చాటిచెప్తున్నారు. విద్య, వైద్యం, వ్యాపారం, రాజకీయాలు, అంతరిక్షం, టెక్నాలజీ.... ఇలా అనేక రంగాల్లో రాణిస్తున్నారు. రంగం ఏదైనా పురుషులకు తామేమీ తీసిపోమని నిరూపిస్తున్నారు. అవరోధాలను అధిగమిస్తూ సాధికార దిశగా అడుగులేస్తున్నారు. నారీ భేరి మోగిస్తున్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కొందరు మహిళల విజయ ప్రస్థానాలను మీ ముందుంచుతున్నాం.



విజయనారి



అనపర్తిలో కూరగాయల దుకాణం నిర్వహిస్తున్న మాజీ సర్పంచ్ జయమ్మ

కూరగాయల జయమ్మ

» అరవై ఏళ్లు కూరగాయల వ్యాపారం » 13ఏళ్ల రాజకీయ జీవితం » ఎంపీటీసీ, సర్పంచ్‌గా జయానబీ ప్రస్థానం

అనపర్తి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కృషి, పట్టుదల ఉంటే మహిళలు పురుషులకు తీసిపోరన్నదానికి తూర్పు గోదావరి జిల్లా అనపర్తికి చెందిన షేక్ జయానబీ (కూరగాయల జయమ్మ) జీవితమే నిదర్శనం. 12 ఏళ్ల ప్రాయంలోనే తండ్రి మార్కెట్‌లో నిర్వహించే దుకాణానికి వచ్చివెళ్తూ సహాయం చేసేది. అలా వ్యాపార రంగంలో అడుగుపెట్టిన ఆమె 72 ఏళ్ల వయసులోనూ వ్యాపారం నిర్వహిస్తూ నేటితరం మహిళలకు ఆదర్శంగా నిలుస్తోంది. అప్పటి కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే తేతలి రామారెడ్డి పిలుపుతో రాజకీయ రంగంలోకి ప్రవేశించి 1996, 2001 ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీచేసి విజయం సాధించారు. ఎంపీటీసీగా ఆమె సేవలను గుర్తించిన రామారెడ్డి 2003లో ఆమెకు అనపర్తి సర్పంచ్ పదవికి పోటీచేసే



దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డితో జయానబీ (పాత చిత్రం)

అవకాశం ఇచ్చారు. అప్పటికే ప్రజా సేవలో తనదైన ముద్ర వేసుకున్న జయమ్మ సర్పంచ్‌గా విజయం సాధించి అనపర్తి పంచాయతీకి మొట్టమొదటి మహిళా సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఐదేళ్లపాటు గ్రామాభివృద్ధికి కృషి చేయడమే కాకుండా కొన్ని పనులు చేసి చెరగని ముద్ర వేసుకున్నారు. రాజకీయాల్లో ఉన్నది 13 సంవత్సరాలైనా ఎంతో తృప్తి పొందానంటున్నారామె. రాజకీయం అంటే సేవ అని, సంపాదని కాదని చెప్పారు. కూరగాయల వ్యాపారం చేసుకుంటూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నానంటున్నారు. కడదాకా కూరగాయల జయమ్మగానే పిలిపించుకోవాలన్నదే తన అభిమతమని ఆమె 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు.



ఢిల్లీలో జరిగిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న సర్పంచ్ కొమరం శ్రావణి, కార్యదర్శి శిరీష

ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ గోకవరం

జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం

గోకవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మహిళల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధిలో అన్ని విధాలా పురోగతి సాధిస్తున్నందుకు తూర్పు గోదావరి జిల్లా గోకవరం గ్రామ పంచాయతీకి అరుదైన గౌరవం దక్కింది. రాష్ట్రస్థాయిలో ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీలుగా ఐదు ఎంపికవ్వగా వాటిలో గోకవరం ఒకటి. జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర మంత్రులు రాజీవ్ రంజన్‌సింగ్, ఎస్పీ సింగ్, అన్నపూర్ణాదేవి ఆధ్వర్యంలో మహిళా సాధికారితపై ఢిల్లీలో బుధవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో గోకవరం సర్పంచ్ కొమరం శ్రావణి, గ్రామ కార్యదర్శి బొర్రు శిరీష, మాజీ ఎంపీటీసీ పులపర్తి బుజ్జి పాల్గొని మహిళల భాగస్వామ్యంతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, మహిళల ప్రాతినిధ్యం తదితర అంశాలను వివరించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎక్కడా లేని విధంగా సర్పంచ్, కార్యదర్శి, పంచాయతీ పాలకవర్గంలో మూడొంతుల మంది మహిళా సభ్యులు వున్నారు. అంతేగాక 400కు పైగా డ్వాక్రా సంఘాలు, వైద్యపరంగా మహిళలకు అందుతున్న సేవలు, ఉపాధి హామీ పథకంలో ఎక్కువ మంది మహిళలు లబ్ధి పొందడం వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకుని గోవకరాన్ని ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ జాబితాలో చేర్చారు.

ఎంపీడీవో ఇంట.. అవార్డుల పంట

గండేపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఒక చేత్తో ఇంటిని, మరో చేత్తో మండలాన్ని చక్కదిద్దుతున్నారు. ఆమే గండేపల్లి ఎంపీడీవో నాతి బుజ్జి. మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారమె. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి 55కిపైగా అవార్డులు, ఎంతోమంది ప్రశంసలు అందుకుంటున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం కట్టుంగ గ్రామానికి చెందిన బుజ్జి గ్రూప్-2కు ఎంపికై 1996లో ఈవోపీఆర్డీగా విధులు చేపట్టారు. ఆపై ఇన్‌చార్జి ఎంపీడీవోగా, 2000లో రెగ్యులర్ ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వర్తించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఉంటే మండలాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయవచ్చో ఆమె చేసి చూపించారు. పట్టువదలని విక్రమార్కుడిలా సిబ్బందితో కలిసి పనిచేస్తూ ఆ మండలానికి రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు తెస్తారు. మాజీ గవర్నర్లు ఎన్‌డీ తివారి, సుశీల్‌కుమార్ షిండే, కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు, మాజీ మంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, యనమల రామకృష్ణుడు, ప్రస్తుత మంత్రి నారా లోకేశ్ నుంచి ఉత్తమ పురస్కారాలు అందుకున్నారు. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం రోజున మంత్రి కందుల దుర్గేష్, గణతంత్ర దినోత్సవం రోజు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి నుంచి ఉత్తమ అవార్డులు పొందారు. సీఎం చంద్రబాబు, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి నుంచి అందుకున్న అవార్డులు ఆమె చేసే సేవలకు మరింత ఊతమిచ్చాయి.





సీఎం చంద్రబాబు నుంచి అవార్డు స్వీకరిస్తున్న బుజ్జి... అందుకున్న అవార్డులు

క్రీడలతో ఒత్తిడి దూరం

● కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్
● ఉమ్మడి జిల్లా ఏపీఎన్జీవోల అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు



క్రీడా మైదానంలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్



బెలూన్లు ఎగురవేసి క్రీడలు ప్రారంభిస్తున్న దృశ్యం

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు తమ రోజువారి విధుల్లో ఒత్తిడిని అధిగమిం చేందుకు క్రీడలు దోహదపడతాయని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్క రించుకుని బుధవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఏపీఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా క్రీడా మైదానంలో క్రీడలను ప్రా రంభించారు. ఈ సందర్భంగా గాల్లో బెలూన్స్ ఎగురవేశారు. అనం తరం 100 మీటర్ల పరుగు పందాన్ని ఆయన జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించి, మాట్లాడుతూ ఈ క్రీడలు రెండు రోజుల పాటు మహిళా ఉద్యోగులంతా తమ రోజువారీ విధులను పక్కనపెట్టి వయసుతో సంబం ధం లేకుండా పూర్తిగా నిమగ్నం కావాలన్నారు. ఏపీఎన్జీజీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నాలన్నారు. ప్రతి కుటుంబంలో ఒక వర్కింగ్ ఉమెన్ ఉంటే ఆ కుటుంబం ఆర్థికంగానే కాకుండా, ఇతర విషయాల్లోనూ సంతోషంగా ఉంటుందన్నారు. దీనిలో భాగంగా తల్లి గొప్పతనాన్ని గురించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎన్జీజీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఏపీఎన్జీ జీవో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసు, జిల్లా కార్యదర్శి వెంకటకృష్ణ, ఏపీఎన్జీవో అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు రామానాయుడు, ఆశీర్వాదం, మహిళా విభాగం ఛైర్మన్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.



హాజరైన మహిళా ఉద్యోగులు

'నన్నయ'లో రెండోరోజూ

ఉత్సాహంగా నారీఫెస్ట్

● సృజనాత్మకతను ప్రదర్శించిన మహిళలు



చిత్రలేఖనం పోటీలను పరిశీలిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో రెండో రోజు బుధవారమూ ఉత్సాహంగా నారీఫెస్ట్ జరిగింది. ఈ పోటీలలో మహిళలు పాల్గొని సృజనాత్మకతను ప్రదర్శించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వర్సిటీలోని ఉమెన్‌సెల్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. దీనిలో భాగంగా అనుబంధ కళాశాలల మహిళా సిబ్బందికి వివిధ పోటీలు నిర్వహించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జరిగిన చిత్రలేఖన పోటీలను వీసీ ప్రసన్నశ్రీ వీక్షించి వారిని అభినందించారు. అనంతరం మహిళల ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఉమెన్స్‌సెల్ కోఆర్డినేటర్ పి.ఉమామహేశ్వరిదేవి, అధ్యాపకులు ఎన్.సజనారాజ్, బి.విజయకుమారి, కె.రమణేశ్వరి, కె.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



సృజనాత్మక పోటీలో పాల్గొన్న మహిళలు

నేడు మహిళా దినోత్సవ వేడుకలు

వర్సిటీలో అంతర్జాతీయ మహిళాదినోత్సవ వేడుకలను గురువారం నిర్వహిస్తామని వీసీ తెలిపారు. నారీఫెస్ట్ విజేతలకు జ్ఞాపికలు, ధృవపత్రాలను అందజేస్తామన్నారు. మహిళలందరూ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'కోనసీమ'ను కోకో హబ్‌గా తీర్చిదిద్దేందుకు..

● కోకో సంఘం ఏర్పాటు

అమలాపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాను కోకో హబ్‌గా తీర్చిదిద్దేందుకు నాంది పలుకుతూ కోనసీమ కోకో సంఘం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ఉద్యాన, సహకార రిజిస్టర్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి సంఘం ఏర్పాటు విధి,విధానాలపై సమాలోచనలు జరిపారు. కోకో సంఘంలో అధ్యక్షుడిగా జాయింట్ కలెక్టర్, ఉపాధ్యక్షులుగా జిల్లా ఉద్యాన అధికారి, సభ్యులుగా జిల్లా మార్కెటింగ్‌శాఖ, జిల్లా పరిశ్రమల కేంద్ర, జిల్లా సహకార అధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల నుంచి అడ్డాల గోపాలకృష్ణ, సరెళ్ల అప్పారావులను నియమిస్తామన్నారు. సంఘ రిజిస్ట్రేషన్ ఏర్పాట్లు ప్రారంభించాలన్నారు. క్లస్టర్‌లవారీగా ఖోఖో పంటల విస్తరణకు జిల్లాలో ప్రాథమిక దశలో వెయ్యి ఎకరాలను గుర్తిస్తూ లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశించారు. జిల్లాలో లక్ష ఎకరాల్లో కొబ్బరి తోటలు ఉన్నాయని, వీటిలో 50శాతం పాక్షిక నీడలో కోకో సాగుకు అనువైన ప్రాంతాలను ఎంపిక చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా రిజిస్టర్ నాగలింగేశ్వరరావు, జిల్లా సహకార అధికారి ఎస్.మురళీకృష్ణ, జిల్లా ఉద్యాన అధికారి బీవీ రమణ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంతో ...

నాకెంతో అనుబంధం

● సీనియర్ సినీ నటి జయప్రద ● కోటిలింగాల రేవులో సోదరుడి అస్థికల నిమజ్జనం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంతో తనకెంతో అనుబంధం ఉందని సీనియర్ నటి జయప్రద గుర్తు చేసుకున్నారు. బుధవారం తన సోదరుడు రాజబాబు అస్థికలను మేనల్లుడు స్మ్రామాట్‌తో కలిసి కోటిలింగాల రేవులో బుధవారం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఆమె తన సోదరుడు స్మ్రామాట్‌తో రాజమహేంద్రవరంలో ఉన్నప్పటి రోజులను గుర్తు చేసుకుని కన్నీరు పెట్టుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. ఈమెతోపాటు కుటుంబ సభ్యులు, తదితరులు ఉన్నారు.



కోటిలింగాలరేవులో అస్థికలను నిమజ్జనానికి తీసుకువెళ్తున్న స్మ్రామాట్, జయప్రద

శాంతి భద్రతల పరిరక్షణలో..

పోలీసులదే కీలకపాత్ర

● కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ● ముగిసిన సాయుధ దళాల వార్షిక మొబలైజేషన్

కాకినాడ క్రైం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణ, సమాజ సేవ, అసాంఘిక కార్యకలాపాలను ఉక్కుపాదంతో అణచివేయడంలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసుల కృషి, సహకారం ఎంతో కీలకమని కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. కాకినాడ జిల్లా సాయుధ దళాల వార్షిక మొబలైజేషన్ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఇటువంటి శిక్షణల ద్వారా వృత్తి నైపుణ్యాలు పెంపొందడమే కాకుండా, శారీరక ధృడత్వంతో పాటు వ్యాయామం, ఆరోగ్యం లభిస్తుందన్నారు. మనమంతా శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేయాలని కోరారు. సిబ్బంది శారీరక ధృడత్వం, ఆయుధాలతో విన్యాసాలు, ఫైరింగ్, మాబ్ ఆపరేషన్‌లో నాణ్యమైన శిక్షణ పొందారని కితాబిచ్చారు. ముగింపు పరేడ్‌లో జిల్లా సాయుధ దళాలు నిర్వహించిన ప్రతిభను అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) ఎంజేవీ భాస్కరరావు, ఏఎస్పీ (ఏఆర్) శ్రీనివాసరావు, ట్రైనీ ఏఎస్పీ కుమారి సుస్మిత, ట్రైనీ డీఎస్పీ కుమారి జీవన, పరేడ్ కమాండర్ ఆర్ఏఆర్ నరసింహమూర్తి, ఆర్ఎంటీ వెంకట్రావు, సాయిధ దళాల ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.



సాయుధ దళాల పరేడ్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ బిందు మాధవ్

గంజాయి ముఠా అరెస్ట్

» జగ్గంపేటలో 492 కిలోల గంజాయి, రూ.2.78లక్షల నగదు స్వాధీనం

» పోలీసుల అదుపులో ఎనిమిదిమంది

» పరారీలో ఇద్దరు



జగ్గంపేటలో గంజాయితో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

జగ్గంపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేటలో గంజాయి రవాణా ముఠాను పోలీసులు పట్టుకున్నారు. బుధవారం జగ్గంపేట పోలీస్‌స్టేషన్‌లో మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్‌కు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు బుధవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో 492 కిలోల గంజాయిని తరలిస్తున్న ఎనిమిదిమందిని అరెస్టు చేశారు. వారిలో అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన ముగ్గురు, కాకినాడ జిల్లాకు చెందిన ఒకరు, తమిళనాడుకు చెందిన ఇద్దరు, కర్ణాటకకు చెందిన మరో ఇద్దరు ఉన్నారు. జగ్గంపేటలోని జగనన్న కాలనీలో ఒక ఇంటిలో గంజాయిని స్వాధీనం చేస్తుకున్నట్టు ఎస్పీ తెలిపారు. ఏపీ31డీడీ4032 నంబరు గల కారులో 7 బస్తాల గంజాయి, ఇంట్లో 10 బస్తాల గంజాయి, రూ.2.78లక్షల నగదు, 7 సెల్‌ఫోన్‌లు, హీరోహోండా బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. 8 మంది నిందితులను అరెస్ట్ చేశారు. తమిళనాడుకు చెందిన మురుగన్, కర్ణాటకకు చెందిన శర్వన్ పరారీలో ఉన్నారు. నిందితులు గంజాయి వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు ఆధ్వర్యంలో సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన జగ్గంపేట ఎస్‌ఐ టి.రఘునాధరావు, గండేపల్లి ఎస్‌ఐ శివనాగబాబు, కిర్లంపూడి ఎస్‌ఐ జి.సతీష్, హెచ్ సీ సలీం, కానిస్టేబుల్స్ కృపారావు, బాలాజీ, సత్యనారాయణ, హోంగార్డులు అనీల్, వీరబాబు, సోమరాజు, సూరిబాలును ఎస్పీ అభినందించారు.

తాళ్లరేవులో ఎనిమిది మంది...

తాళ్లరేవు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): యువకులకు గంజాయి సరఫరా చేసి వాటి ద్వారా వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్న కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలానికి చెందిన మత్స్యకార యువకులను బుధవారం అరెస్ట్ చేసి వారి నుంచి 5.262 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు కోరింగ ఎస్‌ఐ పి.సత్యనారాయణ తెలిపారు. వివరాల ప్రకారం.. గాడిమొగ పంచాయతీ లక్ష్మీపతిపురం గ్రామానికి చెందిన కర్రి వీర వెంకట సురేంద్ర అలియాస్ మ్యాఘ్యు, గిరి, పెదవలసలకు చెందిన చెక్కా రాజేష్ అలియాస్ రాజు, కోరింగ పంచాయతీ పెదబొడ్డువెంకటాయపాలెం కర్రి గంగాధర్, పాలెపు సతీష్, చిన బొడ్డువెంకటాయపాలెనికి చెందిన సంగాడి దుర్గామల్లేశ్వరరావు, కర్రి ఆదివిష్ణు, కాకినాడ అర్బన్ గోలీలుపేట, వెంకట్‌నగర్‌కు చెందిన వీరవెంకట సత్యనారాయణ అలియాస్ ఆటో నానిలు పెద్దాపురం పంచాయతీ అరకు వ్యాలీ మండలానికి చెందిన పాంగి గోవిందు, పాంగి డొంబులతో పరిచయం పెంచుకుని వారి ద్వారా గంజాయిని తరలిస్తూ తాళ్లరేవు మండలంలోని యువకులకు సరఫరా చేస్తున్నారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ, కోరింగ ఎస్‌ఐ ఆధ్వర్యంలో తాళ్లరేవు మండలం సీతారామపురంలో నాన్ లేఅవుట్ లో ఉన్న ఒక ఇంటి వద్ద గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సీఐ చైతన్యకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

తునిలో ఇద్దరు..

తుని రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): 6 కిలోల గంజాయితో తునిలో నర్సీపట్నం బస్ స్టాప్‌లో గంజాయితో దిగి అక్కడ నుంచి రైలు మార్గం గుండా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు. వారిని పరిశీలించగా 6 కేజీల గంజాయిని ప్యాకింగ్ చేసి ఇతర ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్నట్టు గుర్తించారు.పట్టుబడిన బొడ్డు వరప్రసాద్, వెనిగళ్ళ పద్మపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరపరచనున్నట్టు సీఐ గీత రామకృష్ణ తెలిపారు. పద్మపై విజయవాడ భవానీపురం స్టేషన్లో, నంద్యాల జిల్లా ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో కేసులు ఉన్నట్టు తెలిపారు. నిందితులు చాలా కాలంగా గంజాయి వ్యాపారం చేస్తున్నట్టు గుర్తించారు.



తాళ్లరేవు: నిందితులతో పోలీసులు

ప్రపంచ పర్యాటకుల గమ్యస్థానంగా ఏపీ

బెర్లిన్ సదస్సులో మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటకుల గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్‌ని తీర్చిదిద్దడానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. జర్మనీలోని బెర్లిన్‌లో జరుగుతున్న ఐటీబీ బెర్లిన్-2025కు ఆయన హాజరైన విషయం తెలిసిందే. సదస్సులో రెండో రోజు ఏపీ పర్యాటకరంగంలో పెట్టుబడులకు అవ కాశాలపై వరల్డ్ మీడియా ప్రతినిధులకు వివరించారు. పలువురు పెట్టుబడిదారులతో ప్రత్యేకంగా సమావేశమై ఏపీలోని పర్యాటక రంగంలోని అవకాశాలపై చర్చించారు. మంత్రి మాట్లాడుతూ దక్షిణ భారతదేశ పర్యాటకానికి ఏపీ ముఖ ద్వార మని చెప్పారు. ఏపీలో దాదాపు వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ విశాల సముద్రతీరం, సుం దర బీచ్‌లు, ఎత్తైన హిల్ ప్రదేశా లు, ప్రకృతి రమణీయ ప్రాంతాలు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు ఉన్నాయన్నారు. తిరుమలలోని వేంకటేశ్వర దేవస్థానం విశిష్టతను వివరించారు. అమరావతి, నాగార్జున కొంత వం టివి బుద్ధిజానికి ప్రతీకగా నిలిచాయన్నారు. గ్రామీణ పర్యాటకాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. గిరిజనుల జీవన విధానాన్ని అరకు లోయ కళ్లకు కట్టినట్టు చూపిస్తోందన్నారు. వ్యర్థ ఘన పదార్థాల నిర్వహణకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం ద్వారా పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రతకు పెద్ద పీట వేస్తున్నామని పేర్కొన్నారు.



బెర్లిన్‌లో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

రుణాలిప్పిస్తామని ఆశ జూపి మోసం

పోలీసులకు బాధితుల ఫిర్యాదు

ఇద్దరి అరెస్ట్

కాకినాడ క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రుణాలిప్పిస్తామని నమ్మబలికి.. తలో రూ.5 వేలు ముందు కట్టించుకున్నారు. ఆపైన రుణాలిప్పించకుండా మొహం చాటేయడంతో బాధితులు పోలీసులు ఆశ్రయించడంతో నిందితులను కాకినాడ త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి జైలుకి తరలించారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పనసపాడుకు చెందిన కందికట్టు శిరీష (ప్రియాంక) ఇన్‌ఫినిట్ పేరుతో కాకినాడ డైయిరీఫారమ్ సెంటర్‌లో కార్యాలయం నిర్వహిస్తోంది. కొన్నేళ్లుగా ఈ గ్రూపు పేరుతో రుణాలు ఇప్పిస్తామని, ముందుగా తలో రూ.5వేలు చెల్లిస్తే లోన్లు మంజూరు చేయిస్తానని నమ్మబలికింది. ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంకు చెక్కులు తీసుకుని రూ.5వేలు ఫీజు వసూలు చేసింది. డబ్బులు కట్టించుకోవడం తప్పించి, రుణాలు ఇవ్వకుండా తప్పించుకుని తిరుగుతుంది. దాంతో మోసపోయామని భావించిన బాధితులు బుధవారం కాకినాడ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు డైరీఫారం సెంటర్‌లో గల ఇన్ఫినిట్ కార్యాలయంపై దాడి చేశారు. నిర్వాహకురాలు శిరీష, ఆమెకు సహకరిస్తున్న చెట్ల సూర్యవెంకట రమణను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆ వ్యక్తి ఎవరు?

» బైపాస్‌రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసుపై దర్యాప్తునకు 5 బృందాలు

» రాష్ట్రవ్యాప్తంగా మిస్సింగ్ కేసులపై ఆరా

» స్వయంగా పర్యవేక్షిస్తున్న కాకినాడ ఎస్పీ

గొల్లప్రోలు రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్‌రోడ్డులో పోలవరం కాలువ చెంతన గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురైన సంఘటనపై దర్యాప్తు కోసం 5 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. బైపాస్‌రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి మరణించి ఉండగా పోలీసులు గుర్తించిన సంగతి తెలిసిందే. ఎక్కడో హత్య చేసి ఇక్కడకు తీసుకువచ్చి పడవేసి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. బుధవారం రాత్రి వరకూ మృతుడు ఎవరనే విషయంలో ఎటువంటి క్లూ పోలీసులకు లభించలేదు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఏఎస్పీ మనీష్ దేవరాజ్‌పాటిల్ స్వయంగా సంఘటనా స్థలాన్ని పరిశీలించడంతో పాటు దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలతో కూడిన 5 బృందాలను ఏర్పాటు చేశారు. కత్తిపూడి- పిఠాపురం మధ్య గల అన్ని సీసీ టీవీల ఫుటేజీలను పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి నెలతో పాటు ఇప్పటివరకూ అదృశ్యమైన సంఘటనలకు సంబంధించి మిస్సింగ్ కేసుల వివరాలను సేకరిస్తున్నారు. మృతుడి చేతికి ఉన్న రాగి కడియం ఒక్కటే కేసుకు ఆధారంగా ఉంది. కాగా బుధవారం మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, ట్రైనీ ఐపీఎస్‌లు ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. వారి వెంట పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

బంధువుల ఇంటికొచ్చి.. అంతలోనే మరణించి!

హైవేపై గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



అన్వేష్ (ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రాజానగరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక యువకుడు మృతిచెందాడు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలంలో శ్రీకృష్ణపట్నం గ్రామానికి చెందిన యేలేటి అన్వేష్ (22) బుధవారం రాజానగరంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. తిరిగి మోటార్‌సైకిల్‌పై రాజమ హేంద్రవరం వెళ్తున్న క్రమంలో హైవేపై గైట్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోకి వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి తలపై నుంచి వెళ్లిపోవడంతో తలభాగం నుజ్జు నుజ్జయ్యి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రాజానగరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించే దిశగా చర్యలు చేపట్టారు. మృతుడి తండ్రి యేలేటి దుర్గారావుకు ఇద్దరు కుమారులు. కాగా అవివాహితుడైన అన్వేష్ గ్రామంలోనే కులవృత్తి చేస్తూ తండ్రికి ఆసరాగా ఉంటుండగా, చిన్న కుమారుడు దొరబాబు డిగ్రీ చదువుకుంటున్నాడు. అందివచ్చిన కొడుకు అకస్మాత్తుగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంపై తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతదేహాన్ని పంచనామా అనంతరం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆసుపత్రి వద్దకు చేరుకుని వైద్యులను సంప్రందించి త్వరిత గతిత పోస్టుమార్టం పూర్తిచేసే దిశగా సహకారాలు అందించారు.

ఉపాధి కూలీ మృతి

బిక్కవోలు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రంగాపురం గ్రామానికి చెందిన ఉపాధికూలీ మేడిశెట్టి గోవిందమ్మ(65) మృతి చెందింది. ఏపీవో అగస్టీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గోవిందమ్మ బుధవారం గ్రామంలోని ఇంజనీరు పొలం నుంచి వంత కాలువ పూడికతీత పనులకు వెళ్లి పనిచేస్తూ 10 గంటల సమయంలో కళ్లు తిరిగి పడిపోయింది. దీంతో తోటి కూలీలు ఆమెను ఇంటికి చేర్చారు. కుటుంబసభ్యులు ఆమెకు స్థానిక ఆర్ఎంపీతో ప్రథమ చికిత్స చేయించి అనపర్తి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం 2 గంటలకు మృతి చెందింది.



రంగాపురంలో ఉపాధి పనులు చేస్తూ కళ్లు తిరిగిపడిపోయిన గోవిందమ్మ

వా(హ్హా)ట్సాప్.!



● తొలిసారిగా పదో తరగతి హాల్ టిక్కెట్లు వాట్సాప్ ద్వారా డౌన్లోడ్

అమలాపురం రూరల్/కాకినాడ రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17వ తేదీ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు తొలిసారిగా వాట్సాప్ ద్వారా హాల్ టిక్కెట్లు డౌన్లోడ్ చేసుకునే సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ కల్పించింది. గతేడాది వరకు విద్యార్థుల హాల్‌టిక్కెట్లు తపాలాశాఖ ద్వారా ఆయా పాఠశాలలకు బట్వాడా చేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేకుండా సెల్‌ఫోన్‌లోనే హాల్ టిక్కెట్ డౌన్లోడ్ చేసుకునే సదుపాయం ఇప్పటికే ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చినట్టు డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా, కాకినాడ జిల్లా డీఈవో పి.రమేష్ తెలిపారు. వాట్సాప్, మన మిత్ర ద్వారా విద్యార్థులు హాల్ టిక్కెట్లు డౌన్లోడ్ చేసుకోవచ్చు.

ఎలా డౌన్లోడ్ చేసుకోవాలి?

విద్యార్థులు సెల్‌ఫోన్ ద్వారా 9552300009 నంబరుకు హాయ్ అనే సందేశాన్ని పంపితే సేవను ఎంచుకోండి అని వస్తుంది. దానిపై క్లిక్ చేసి ఎడ్యుకేషన్ సర్వీసు లేదా విద్యాసేవలు ఎంచుకోండని వస్తుంది. అక్కడ ఎస్ఎస్‌సీ హాల్ టిక్కెట్ అని నమోదు చేసి అప్లికేషన్ నంబరు, విద్యార్థి గుర్తింపు నంబరు, డేట్ ఆఫ్ బర్త్‌ను నమోదు చేసి స్ట్రీమ్‌ను సెలెక్ట్ చేయాలి. అనంతరం కన్ఫర్మ్ మీద క్లిక్ చేస్తే హాల్ టిక్కెట్‌ను వాట్సాప్ వస్తుంది. అన్ని యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు డౌన్లోడ్ చేసుకున్న హాల్ టిక్కెట్‌లో విద్యార్థి పేరు, పుట్టినతేదీ, మీడియం, ఫోటోగ్రాఫ్ సంతకం తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని డీఈవోలు పేర్కొన్నారు. హాల్ టిక్కెట్ వివరాల్లో ఏదైనా మార్పు ఉంటే వెంటనే ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్స్‌కు మెయిల్ ద్వారా సమాచారం పంపించాలని తెలిపారు. డౌన్‌లోడ్ అయిన హాల్ టికెట్‌లో విద్యార్థి వివరాలన్నింటినీ పరిశీలించుకుని ఏమైనా అభ్యంతరాలుంటే సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి dir_govexams@yahoo.comకు ఈ-మెయిల్ ద్వారా పంపించాలని సూచించారు.

8న జాతీయ లోక్ అదాలత్

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

రాజమహేంద్రవరం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఈ నెల 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత తెలిపారు. ఆ రోజున ఉదయం 10 గంటల నుంచి రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రాపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల్లో జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, ప్రమాద, బ్యాంకు, ప్రీలిటిగేషన్, రాజీపడదగిన క్రిమినల్ కేసులకు రాజీ మార్గం ద్వారా పరిష్కారం చూపడం జరుగుతుందన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

వచ్చే నెల 7 నుంచి వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలు

ఆత్రేయపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్యకల్యాణ మహోత్సవాలు ఏప్రిల్ 7 నుంచి 13 వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఏప్రిల్ 8 స్వామివారి రథోత్సవం, కల్యాణోత్సవం, తీర్థ మహోత్సవం కార్యక్రమాలను తిలకించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. ప్రభుత్వం నోటిఫైడ్ ఫెస్టివల్ కావడంతో వివిధ శాఖల అధికారులు భక్తులకు సేవలు అందించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో గురువారం ఆర్డీవో పి.శ్రీకర్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో తొలి దఫా సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యలపై ఆర్డీవో సమీక్షించనున్నారు. దీనికి సంబంధించి ఏర్పాట్లు స్వీహిస్తున్నట్టు ఉపకమిషనరు ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

25 నుంచి అధ్యయనోత్సవాలు...

స్వామివారి కల్యాణోత్సవాలకు ముందుగా అధ్యయనోత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ నెల 25వ తేదీ నుంచి 29 వరకు నిర్వహించనున్నారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించే ఉత్సవాల్లో హోమాలు, ద్రవిడ వేద పారాయణం, పల్లకి మహోత్సవం, గరుడ వాహనసేవ, సింహవాహన సేవ తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నారు.

ఆ హామీ నెరవేర్చాకే డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలి


ఏఐఎస్‌టీఈఏ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు వరహాలదొర

దివాన్‌చెరువు, మార్చి5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన వాగ్దానం మేరకు జీవో నెంబరు 3కి ప్రత్యామ్నాయం చూపిన తర్వాతే డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం (ఏఐఎస్‌టీఈఏ) తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్.వరహాలదొర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఈనెలలో ఇస్తామని మంత్రి లోకేశ్ శాసనమండలిలో ప్రకటించారన్నారు. అయితే సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు జరిపిన ప్రచారంలో యువతకు ప్రత్యేకమైన డీఎస్సీ ఇస్తానని, మెగా డీఎస్సీలో గిరిజనులకు జీవో నెంబరు 3 ప్రకారమే నియామకాలు చేపడతామని చెప్పారన్నారు. లేదా ప్రత్యామ్నాయం తీసుకువస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ జీవో ప్రకారం స్థానికంగా నివాసం ఉంటున్న గిరిజన యువతతోనే నూరుశాతం ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలన్నారు. దీనివల్ల గిరిజన తెగల్లో వారు ఉపయోగించే ప్రత్యేకమైన భాషను ఉపయోగించి విద్యార్థులకు బోధించవచ్చన్నారు. ఇచ్చిన హామీ మేరకు జీవో నెంబరు 3 ప్రకారం ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ చేపట్టాలని డిమాండ్ చేశారు.

భావనారాయణస్వామి సన్నిధిలో

సినీ నటి మీనాక్షి చౌదరి పూజలు

కాకినాడలో జన్మదిన వేడుకలు






సర్పవరంలో పూజలు చేస్తున్న మీనాక్షి చౌదరి, కాకినాడలో స్నాక్స్ పంచుతూ..

సర్పవరం జంక్షన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పురాతన పుణ్యక్షేత్రమైన కాకినాడ జిల్లా సర్పవరంలో శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామిని బుధవారం సినీ నటి మీనాక్షి చౌదరి దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి చరిత్ర, ఆలయ విశిష్టతపై పండితులు వివరించారు. స్వామివారి దర్శనం అనంతరం భావనారాయణస్వామి చిత్రపటం, ప్రసాదాన్ని అందించారు. భావనారాయణస్వామి విశిష్టతను తెలుసుకుని స్వామివారిని దర్శించుకునేందుకు విచ్చేసినట్టు మీనాక్షి తెలిపారు. అలాగే కాకినాడలో బాలల సంరక్షణా కేంద్రంలో మీనాక్షి చౌదరి జన్మదిన వేడుకలు నిర్వహించుకున్నారు. కేక్ కట్ చేసి పిల్లలకు స్నాక్స్, స్వీట్స్ పంచి పెట్టారు.

భీమేశ్వరస్వామి ఆదాయం రూ.27.97 లక్షలు



హుండీలలో కానుకలను లెక్కిస్తున్న సేవకులు, సిబ్బంది

ద్రాక్షారామ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరస్వామి హుండీలలో కానుకలను లెక్కించగా రూ.27,97,105 నగదు, 10గ్రాముల బంగారం సమకూరింది. అన్నదాన హుండీ ద్వారా రూ.90.186 ఆదాయం లభించింది. బుధవారం స్వామివారి హుండీలను దేవదాయ శాఖ ఉప కమిషనరు, మహాశివరాత్రి ఉత్సవ అధికారి డీఎల్‌వీ.రమేష్ బాబు పర్యవేక్షణలో సహాయ ఉత్సవ అధికారి, సహాయ కమిషనరు విజయలక్ష్మీ ఆధ్వర్యంలో స్వామివారి హుండీలను తెరిచి లెక్కించారు. 13 డిసెంబరు 2024 నుంచి బుధవారం వరకు సదరు మొత్తం ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనరు దుర్గాభవానీ తెలిపారు. కార్యక్రమంలో ముప్పనపల్లి గణేష్, నామా వెంకన్నబాబు, దవులూరి రామకృష్ణ, పెంకె సాంబశివరావు, అల్లం రామకృష్ణ, ఆళ్లబుజ్జి, నవీన్, కర్రా నాగేశ్వరరావు, అద్దంకి అర్జున్, ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు ఉన్నారు.

గోవులను తరలిస్తున్న కంటెయినర్ అడ్డగింత

వాహనం సీజ్, పరారీలో డ్రైవర్

గోశాలకు పశువుల తరలింపు



పట్టుబడిన కంటెయినర్

రాజానగరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పశువులను అక్రమంగా తరలిస్తున్న కంటెయినర్‌ను జాతీయ రహదారిపై రాజానగరం సమీపంలోని సూర్యారావుపేట దుర్గమ్మ గుడి వద్ద హిందు గోసేవా సమితి సభ్యులు బుధవారం అడ్డుకున్నారు. వాహన డ్రైవర్ కంటెయినర్‌ను ఆపకుండా వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో లారీకి అడ్డుగా నిలిచి అద్దాలు ధ్వంసం చేసే క్రమంలో చేసేది లేక వాహన డ్రైవర్ పరారయ్యాడు. దీంతో విషయం తెలుసుకున్న రాజానగరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గోసేవ సమితి సభ్యులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు డీఎస్పీ శ్రీకాంత్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని వివరాలు వెల్లడించారు. కంటెయినర్‌లో ఆవుల్ని తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పరిశీలించగా 52 ఎద్దులు క్లోజ్డ్ కంటెయినర్‌లో బంధించబడి ఉన్నాయన్నారు. పశువుల తరలిస్తున్న వాహనానికి సంబంధించిన లభించిన బిల్లుల ఆధారంగా శ్రీకాకుళం జిల్లా నుంచి చిలకలూరిపేట సంతకు తరలిస్తున్నట్టు తెలుస్తోందన్నారు. వాహన డ్రైవర్ పరారీలో ఉన్నాడని, సంబంధిత యజమానితో ఫోన్‌లో సంప్రదించామన్నారు. కాగా క్లోజ్డ్ కంటెయినర్‌లో పశులను తరలించడం చట్టరీత్యా నేరమని, ఆర్డీవో ఆదేశాల మేరకు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వాహనాన్ని సీజ్ చేశారని, అలాగే వాహనంలో ఉన్న ఎద్దులను పశుసంవర్థకశాఖ అధికారుల సూచనల మేరకు సీతానగరం మండలం బొబ్బిల్లంక వద్ద ఉన్న రీహేబిటేషన్ సెంటర్‌కు తరలించామన్నారు. కేసు నమోదు చేశామని, ఎద్దులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ఆరా తీస్తున్నామన్నారు.

పోలీసుల తీరుకు నిరసనగా ర్యాలీ

గోవుల రవాణా మాఫియాకు సహక రిస్తున్న రాజానగరం సీఐపై చర్యలు తీసుకోవాలంటూ హిందూ గోసేవా సమితి సభ్యులు బుధవారం రాజానగరంలో నిరసన ర్యాలీ చేపట్టారు. గత నెల 26న మహాశివరాత్రి రోజున రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలో గామన్ బ్రిడ్జిపై గోవులను అక్రమంగా తరలిస్తున్న కంటె యినర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగిస్తే చర్యలు తీసుకోకుండా అక్రమ మాఫియాకు మద్దతుగా పోలీసులు సహకరించారని ఆరోపించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని సీఐకు వ్యతిరేకంగా నినాదాలుచేసి వినతి అందజేశారు.



రాజానగరంలో ర్యాలీ చేస్తున్న హిందూ గోసేవా సమితి సభ్యులు

‘60 ఏళ్లు నిండిన తర్వాత ఆశా కార్యకర్తలు పదవీ విరమణ చేయాలి’

జీజీహెచ్ (కాకినాడ), మార్చి5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలు 60 ఏళ్లు నిండిన తర్వాత ప్రభుత్వ నిబంధనల మేరకు పదవీ విరమణ చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 4,510 మంది ఆశా కార్యకర్తలు పలు పీహెచ్‌సీల్లో పనిచేస్తున్నారన్నారు. గతేడాది 2024లో 10 మంది ఆశాలు, 2025లో ఫిబ్రవరి వరకు 18 మంది పదవీ విరమణ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఆశాలపై ఆశా నోడల్ ఆఫీసర్లు, వైద్యాధికారులు 60 ఏళ్లు నిండిన వారి వివరాలను జిల్లా వైద్యఆరోగ్య కార్యాలయానికి పంపడం జరుగుతుందన్నారు. పదవీ విరమణ చేసిన వారికి రావాల్సిన రాయితీలు, ఆర్థిక లావాదేవీలు సత్వరంగా విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రోడ్డుపైనే ఇసుక
కాట్రేనికోన, మార్చి 5(ఆంధ్రజ్యోతి):నడవపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ ట్యాంక్ వద్ద ఇసుకను అడ్డంగా వేశారు. వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారు. ఈఅంశంపై ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందిని ప్రశ్నించగా కాంట్రాక్టర్ వెళ్ళిపోయారని, సంబంధం లేదంటున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇసుకను తొలగించకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

రోడ్ల పక్కన చెత్త లేకుండా చూడండి
ఉప్పలగుప్తం,మార్చి5(ఆంధ్రజ్యోతి): రహదారుల ప్రక్కన చెత్తకుప్పలు లేకుండా చూడాలని డీఎల్‌పీవో పి.బొజ్జిరాజు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం భీమనపల్లిలో జరిగిన సమావేశంలో గ్రామాల పారిశుధ్యంపై ఆయన మాట్లాడారు. తడి, పొడి చెత్తపై అవగాహన లేకపోవడానికి కార్యదర్శుల నిర్లక్ష్యమే కారణమన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలని ఏఎన్‌ఎంల నిరసన


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సచివాలయ ఏఎన్‌ఎంలు


మామిడికుదురు: వైద్యాధికారికి వినతిపత్రం అందిస్తున్న ఏఎన్‌ఎంలు

అమలాపురం టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పని ఒత్తిడితో తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నామని సచివాలయ ఏఎన్‌ఎంలు ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయ సర్వేలతో పాటు వైద్య ఆరోగ్యశాఖ సర్వేలు కూడా చేయాల్సి వస్తుండడంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామన్నారు. జిల్లా పరిధిలోని లక్కవరం, కేశనపల్లి, తాటిపాక, నగరం, నాగుల్లంక, పి.గన్నవరం, అమలాపురం అర్బన్‌లకు చెందిన సచివాలయ ఏఎన్‌ఎంలు బుధవారం కేవీఆర్ కుమారి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. తమ ఎస్‌ఆర్‌లు వైద్య ఆరోగ్యశాఖ వద్ద ఉంటే జీతాలు పంచాయతీరాజ్‌శాఖ చెల్లిస్తున్నందున అటు సచివాలయ పనులు, ఇటు వైద్య ఆరోగ్యశాఖ పనులు ఒకేసారి చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. కేవలం వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించిన పనులకు మాత్రమే పరిమితం చేయాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందించి ఈనెల8వ తేదీ వరకు ఉన్న వర్క్ ఫ్రం హోమ్ సర్వేను పూర్తి చేయాలని, అనంతరం వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన పనులకు మాత్రమే పరిమితం చేసేలా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారితో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

ఒక శాఖకు పరిమితం చేయండి
మామిడికుదురు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): సచివాలయంలో ఏఎన్‌ఎంలుగా విధులు నిర్వహిస్తున్న తమను ఏదో ఒక శాఖకు పరిమితం చేయాలంటూ వినతిపత్రాన్ని వారు బుధవారం నగరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి స్వర్ణలతకు అందించారు. ఒకే సమయంలో రెండు శాఖల్లో విధులు నిర్వహించడం తమకు ఇబ్బందిగా ఉందని, పనిభారం పెరగడంతో అనారోగ్యం బారిన పడుతున్నామన్నారు. ఒక వైపు సచివాలయ విధులు, మరోవైపు వైద్యఆరోగ్యశాఖ విధులతో సతమతున్నామన్నారు. ప్రస్తుతం తాము సచివాలయానికి చెందిన విధులు మాత్రమే నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇదే విధంగా లూటకుర్రు పీహెచ్‌సీ పరిధిలోని ఏఎన్‌ఎంలు కూడా అక్కడి వైద్యాధికారికి వినతిపత్రం అందించారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

నాణ్యత లేని సీసీ రోడ్డు.. కొరవడిన పర్యవేక్షణ

- వేసిన ఐదు రోజులకే బీటలు
- యానాం ప్రజాపనుల శాఖతీరు


నూతనంగా వేసిన సీసీ రోడ్డుకు బీటలు

యానాం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): యానాం ప్రజాపనుల శాఖ ఆధీనంలో కోట్లాది రుపాయలతో చేస్తోన్న అభివృద్ధి పనుల్లో నాణ్యతలేక డొల్ల తనం బయట పడుతోంది. కోట్ల రూపాయల నిధులు ఖర్చుచేస్తున్నా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టానికి సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. యానాం శివారు దరియాలతిప్ప గ్రామం ఆనుకుని పర్యాటక ప్రాంతమైనా ఐలాండ్ నెంబర్ 3కి వెళ్లే ప్రధాన రహదారి అభివృద్ధికి రూ.44లక్షలు ఖర్చుచేస్తున్నారు. ఐదుమీటర్ల వెడల్పు 15అంగుళాల మందం కాంక్రీటు రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. పనులు ప్రారంభించి వారం రోజులు గడవకుండానే రోడ్డు బీటాలువారడం అందర్ని విశ్మయానికి గురిచేస్తుంది. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ రోడ్డు పనులు పరిశీలించారు. కొంత రోడ్డు నిర్మాణం జరిగి వారం రోజులు గడిచినా రోడ్డును ప్రతి రోజు తడపక పోవడంతో బీటాలువారాయి. రోడ్డు పనుల్లో నాణ్యతపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అధికారులు మార్చి నెల బడ్జెట్ పూర్తి చేయాలనుకుంటున్నారే తప్ప పనులను అధికారులు పర్యవేక్షణ చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పనులు నాణ్యత ఆరోపణలపై స్థానిక విలేకరులు యానాం పరిపాలనాధికారి మునిస్వామిని ప్రశ్నించగా ప్రజాపనులశాఖ ఈఈ చంద్రశేఖర్‌తో మాట్లాడారు. పనులను పరిశీలించి నాణ్యత లోపాలపై సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్మాణ పనులు పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెడతమాని హెచ్చరించినట్లు ఈఈ చంద్రశేఖర్ తెలిపారు. అయితే రోడ్డు బీటలు వారిని చోట్ సిమెంట్ మాల్‌లో ప్యాచ్ వర్క్ చేశారు.

భూమి రీసర్వేపై ఆర్డీవో సమీక్ష


ఉప్పలగుప్తంలో రీసర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో

ఉప్పలగుప్తం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అమలాపురం ఆర్డీవో కె.మాధవి సర్వేయర్లు, వీఆర్వోలతో బుధవారం సమీక్ష నిర్వహించారు. రీసర్వే జరిగిన తీరుపై ఆరా తీశారు. పలు అంశాలపై వీఆర్వోలు, సర్వేయర్లకు అవగాహన కల్పించారు. అనంతరం రీసర్వే పైలట్ ప్రాజెక్టు గ్రామం ఉప్పలగుప్తంలో పర్యటించి రీసర్వేను పరిశీలించారు. అనంతరం ఇటీవల రాగిజావ తాగి కొందరు విద్యార్థులు అస్వస్థతకు గురైన చల్లపల్లి పంచాయతీ జగ్గరాజుపేట ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనం తయారీ విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ వాసా శామ్యూల్‌దివాకర్ పాల్గొన్నారు.

విధుల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు
పి.గన్నవరం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): సస్పెన్షన్‌కు గురైన లంకలగన్నవరం ఫీల్డ్ అసిస్టెంట్ సరెళ్ల సుబ్బరాజును శాశ్వతంగా విధులు నుంచి తొలగిస్తూ డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ ఉత్తర్వులు జారీచేసినట్లు ఎంపీడీవో కేవీ ప్రసాద్ తెలిపారు. గత ఏడాది సెప్టెంబరులో ఫీల్డ్‌అసిస్టెంట్‌పై సర్పంచ్‌తో పాటు పలువురు నాయకులు, గ్రామస్తులు జాతీయ గ్రామీణ ఉపాధి పథకం అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సెప్టెంబరు 19న అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు అందించారు. నివేదిక పరిశీలన అనంతరం అక్టోబరు 28న సుబ్బరాజును సస్పెన్షన్ చేస్తూ డ్వామా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సుబ్బరాజు తనకు అన్యాయం జరిగిందని హైకోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాలు మేరకు సుబ్బరాజును వ్యక్తి గత విచారణకు హాజరుకావాలని కోరుతూ డ్వామా పీడీ నోటీసులు జారీచేశారు. ఫిబ్రవరి 17న సుబ్బరాజు విచారణకు హాజరై సంజాయిషీ చెప్పుకున్నాడు. విచారణ అనంతరం సుబ్బరాజు విధులు పట్ల అలసత్వం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని క్రమశిక్షణ చర్యల్లో భాగంగా శాశ్వతంగా విధులు నుంచి తొల గిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

రెండో రోజు ఆందోళన
యానాం, మార్చి5(ఆంధ్రజ్యోతి): యానాం ప్రభుత్వ పాఠశాలలో 23ఏళ్లగామిల్క్ బాయిలర్లగా పనిచేస్తోన్న సిబ్బందికి వేతనాలు పెంచాలని కోరుతూ చేస్తున్న ఆందోళన రెండో రోజుకు చేరుకుంది. రాష్ట్ర వ్యాప్తంగ ఉన్న సిబ్బందికి రూ.10వేలనుంచి 18వేలకు పెంచుతూ గతఏడాది ప్రభుత్వం చేసిన ప్రకటన ఇప్పటికీ అమలు కాకపోవడంతో యానాంలో సిబ్బంది ఆందోళన చేపట్టి నినాదాలు చేశారు. తక్షణం ప్రభుత్వం చేసిన ప్రకటనను అమలు చేయాలని సర్వీసులను క్రమబద్ధీకరించాలని కోరారు. ఉదయం పాఠశాలలో విధులు నిర్వహించిన అనంతరం ఆందోళన చేపట్టారు.

డిప్యుటేషన్‌పై ముంగండ హెచ్‌ఎం బదిలీ

- ఉపాధ్యాయులకు ఇంకా జీతాల్లేవు!

పి.గన్నవరం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ముంగండ హైస్కూల్ ఉపాధ్యాయిని ఇటీవల ఆత్మహ టత్యాయత్నానికి పాల్పడిన ఘటన వివాదాస్పదమైంది. ప్రధానోపాధ్యాయురాలు జి.కనకదుర్గ దీనికి కారణమంటూ పాఠశాల ఉపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయ సంఘాల నేతలు నిరసన చేపట్టారు. ఈనేపథ్యంలో డీఈవో సలీం బాషా జరిగిన సంఘటన, ఉపాధ్యాయుల ఆరోపణలపై విచారణ నిర్వహించారు. అనంతరం సెలవుపై వెళ్లాలని హెచ్‌ఎంను డీఈవో ఆదేశించారు. ఇది ఇలాఉండగా మంగళవారం ఉదయం హైస్కూల్‌కు వచ్చిన ఆర్‌జెడీ నాగమణి ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలతో మాట్లాడి సర్దిచెప్పే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. ఈక్రమంలో ప్రస్తుతం సెలవులోఉన్న హెచ్‌ఎం బుధవారం విధులకు హాజరయ్యారని, సమస్య తేలకుండా హెచ్‌ఎం రావడంపై ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి తరగతులకు హాజరైనట్లు తెలిసింది. దీంతో హెచ్‌ఎం స్కూల్ నుంచి వెళ్లిపోయింది. అయితే మంగళవారమే హెచ్‌ఎం కనకదుర్గను జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై అటాచ్ చేస్తూ పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో కంట్రోల్ వింగ్ చూసే బాధ్యతలను అప్పగిస్తూ విద్యా శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేసినట్లు తెలిసింది. కాగా ఫ్యాప్టో సంఘ ఉపాధ్యాయులు మాత్రం ఈసమస్యపై ఆర్‌జేడీని మంగళవారం మధ్యాహ్నం కాకినాడలో కలిసేందుకు ప్రయత్నం చేసినట్లు తెలిసింది. హెచ్‌ఎంపై ఇంకా విచారణ కొనసాగుతుందా లేక డిప్యుటేషన్‌తో ఉన్నతాధికారుల సరిపెట్టుకుంటారా అనే అంశంపై పలువురు ప్రశ్నిస్తున్నారు. కాగా హెచ్‌ఎం లేకపోవడంతో జనవరి నెల జీతాలు హైస్కూల్ ఉపాధ్యాయులకు ఇంకా రాలేదు. ఇప్పటికైనా జీతాలు బిల్లు చేస్తే ఈనెల15వ తేదీ నాటికైనా జీతాలు పడే అవకాశం ఉందని ఓ ఉపాధ్యాయుడు పేర్కొన్నారు.

రేపు మహిళలకు ప్రత్యేక జాబ్‌మేళా
అమలాపురం టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ మహిళలకోసం ఈ నెల 7వ తేదీన వికాస జిల్లాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని వికాస సంస్థ జిల్లా కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్‌లోని తుక్కుగూడలోని ఫాక్స్‌కాన్ కంపెనీలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగులైన మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. ఈకంపెనీలో మొబైల్ అసెంబ్లింగ్ యూనిట్‌లో ఆపరేటర్‌గా పనిచేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని, యువత ఈఅవకాశాన్ని వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ విజ్ఞప్తి చేశారు.

ఓడలరేవును దత్తత తీసుకోవాలని రిలే నిరసన దీక్షలు


మూడో రోజు రిలే నిరసన దీక్షలు

అల్లవరం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): 30ఏళ్లుగా చమురు సహజవాయు నిక్షేపాలు తరలిస్తున్న ఓఎన్జీసీ, గెయిల్ సంస్థలు ఓడలరేవు గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని, అర్హులైన స్థానిక యువకులకు ఓఎన్జీసీ టెర్మినల్‌లో ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మూడో రోజు రిలే నిరసన దీక్షలు కొనసాగించారు. ఓఎన్జీసీ అధికారులు, ప్రోమోటెక్ అధికారులు స్థానికులకు ఉద్యోగాలు ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని, నిర్లక్ష్యం చేస్తే ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద పనులు అడ్డుకుంటామని హెచ్చరించారు. సముద్ర తీరం కోతకు గురవ్వుతున్నందున ఓడలరేవు తీరంలో కోత నుంచి రక్షణ చర్యలు చేపట్టాలని, ఓడలరేవు గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో జరిగిన రిలే దీక్షల్లో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, కొల్లు విష్ణుమూర్తి, కొప్పాడి వెంకటరామకృష్ణారావు, నాతి లెనిన్‌బాబు, పెమ్మాని వెంకటరామారావు, గుండుమేను శ్రీనివాస్, పినపోతు రామకృష్ణ, కేవీ రామ్‌కుమార్, రేకాడి శేషగిరి, పొన్నమండ ఏసుబాబు, జనసేన నాయకులు గుర్రం కృష్ణ, నల్లా రాము పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మ ఉత్సవాల పాత కమిటీ నిర్వాహకుడిపై కేసు నమోదు
అంతర్వేది, మార్చి 5(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం చినకొల్లేరులో వెలసి ఉన్న శ్రీపెద్దింటమ్మవారి జాతర మహోత్సవాలు ఇటీవల దేవదాయశాఖ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. గత కొన్నాళ్లుగా స్థానికంగా కొంత మంది నిర్వాహకులు నిర్వహించేవారు. అయితే వారిలో వారికి తగాదాలు రావడంతో రెవెన్యూ, దేవదాయశాఖ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో సమస్యను పరిష్కరించి తొలిసారి ఉత్సవాల నిర్వహణ జరుగుతుంది. అయితే ఆలయంలో అర్చకులు వారసత్వంగా ఆలయ తాళాలను భద్రపరిచే గంగాదర్ వద్ద నుంచి మెండు వీరవెంకటసత్యనారాయణ (శ్రీను) తాళాలు లాక్కొని పరారయ్యాడు. బుధవారం భక్తులు, ఆలయ సిబ్బంది వచ్చేసరికి ఆలయానికి తాళాలు వేసి ఉండడంతో పోలీసులు, రెవెన్యూ, దేవదాయ శాఖ అధికారులు ఆలయం వద్దకు వచ్చి పరిశీలించారు. వెంటనే జిల్లా ఏసీ వి.సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు మెండు వీరవెంకటసత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.దుర్గాశ్రీనివాస్ తెలిపారు. అనంతరం అమ్మవారి ఆలయ తలుపుల తాళాలు తీసి అమ్మవారికి అభిషేకం, ధూపదీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఆలయంలో ఉన్న అమ్మవారి ఆభరణాలను తనిఖీ అధికారి ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. దీనిపై ఆలయ తాళాలకు సంబంధించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేయగా మెండు వీరవెంకటసత్యనారాయణ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

సమన్వయంతో పాఠశాలల పునర్విభజన ప్రక్రియ


కలెక్టర్ సమీక్షలో మాట్లాడుతున్న డీఈవో సలీంబాషా

అమలాపురం టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాల నిర్వహణ కమిటీలు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పాఠశాలల పునర్విభజన చర్యలను అందరి ఆమోదంతో సజావుగా నిర్వహించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మండల విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలలను ఐదు రకాలుగా పునర్విభజన చేసే ప్రక్రియలోని పురోగతిపై సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలల పునర్నిర్మాణం, బోధనా సిబ్బంది పునర్విభజనపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. ప్రతీ గ్రామ పంచాయతీతో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని అందించడం ద్వారా ఫౌండేషన్, బేసిక్, ప్రైమరీ, మోడల్, ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటుచేస్తూ పాఠశాల విద్యను బలోపేతం చేయడానికి ప్రభుత్వం సంకల్పించిందన్నారు. 6నుంచి 14ఏళ్లవయసు గల పిల్లల డ్రాప్ అవుట్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాలల పునర్విభజన అంశంపై పలు వివరాలను జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్కే సలీంబాషా వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, ఆర్డీవోలు కె.మాధవి, పి.శ్రీకర్, దేవరకొండ అఖిల, బీవీవీ సుబ్రహ్మణ్యం, ఎంఈవోలు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు డొక్కా సీతమ్మ చిత్రపటం అందజేత


సీఎం చంద్రబాబుకు డొక్కా సీతమ్మ చిత్రపటం అందిస్తున్న డొక్కా నాథ్‌బాబు

పి.గన్నవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి టీడీపీ కార్యాలయంలో బుధవారం సీఎం చంద్రబాబునాయుడును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు మర్యాదపూర్వకంగా కలుసుకుని ఎమ్మెల్సీల గెలుపై అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ చిత్రపటాన్ని సీఎం చంద్రబాబుకు నాథ్‌బాబు అందించారు. ఆయనతో పాటు పలువురు రాష్ట్ర స్థాయి టీడీపీ నాయకులు ఉన్నారు.

దువ్వాడపై పోలీసులకు ఫిర్యాదు
ఉప్పలగుప్తం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్, జనసైనికులపై వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ జనసేన ఆధ్వర్యంలో బుధవారం ఉప్పలగుప్తంలో ఆందోళన చేశారు. అనంతరం జిల్లా జనసేన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సంయుక్త కార్యదర్శి చిక్కం భీముడు ఆధ్వర్యంలో దువ్వాడ శ్రీనివాస్‌పై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తాళ్ళ లలిత, చిక్కం వెంకటకృష్ణ, నాగులపల్లి రాజు, బిక్కిన ఏసు, ఆకేటి శ్రీను, ఆకేటి వెంకన్న, గొలకోటి వెంకటేష్, గనిశెట్టి లలితాశ్రీనివాస్, పినిశెట్టి సురేష్, కోడి శివ, చిక్కం బన్ను, నాగులపల్లి పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి చిప్పలతో అద్భుత కళాఖండాలు



అమలాపురం రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి చిప్పలతో తయారుచేసిన కళాఖండాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం అమలాపురం మండల మహిళాసమాఖ్య కార్యాలయంలో జరుగుతున్న కొబ్బరి ఆధారిత చేతికళల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కొబ్బరి చిప్పలను ఉపయోగించి తయారుచేసిన గిన్నెలు, స్పూన్‌లు, దీపాలు, బొమ్మలు, ఇతర అలంకరణ వస్తువులు, గృహోపకరణాల తయారీ విధానం, ప్రాచీన సంస్కృతిక సంప్రదాయాలకు అద్దంపట్టే రీతిలో ఉందని కలెక్టర్ కొనియాడారు. కేరళ ప్రాంతంలో కొబ్బరి చిప్పలతో తయారుచేసిన కళాఖండాలు ఎంతో ప్రసిద్ధి చెందాయన్నారు. కొబ్బరిచిప్పల కళాఖండాలు పర్యావరణ హితమైనవని, వాటిని అత్యధికంగా వినియోగించేలా ప్రోత్సహించాలన్నారు. డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డీపీఎం కృష్ణవేణి, తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్, మాస్టర్ ట్రైనర్, శిక్షణ పొందుతున్న మహిళలు పాల్గొన్నారు.

10న విజయవాడలో బీఎస్పీ కార్యకర్తల మహాసదస్సు
అమలాపురం రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల10న విజయవాడలో జరిగే బహుజన సమాజ్‌పార్టీ కార్యకర్తల మహాసదస్సును విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి కాశి లక్ష్మీభవానీ పిలుపునిచ్చారు. అమలాపురంలోని బీఎస్పీ పార్లమెంటు కార్యాలయంలో బుధవారం మహా సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లాలో అత్యధికంగా ఉన్న బహుజనులు మహాసదస్సుకు తరలిరావాలన్నారు. సదస్సులో జాతీయ సమన్వయకర్త, రాజ్యసభ సభ్యుడు రాంజీగౌతమ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. జిల్లాప్రధాన కార్యదర్శి జాన్‌మోషే, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కోలా త్రిమూర్తులు, నియోజకవర్గ అధ్యక్షుడు పెండెం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బుడితి దయామహేష్, ప్రధాన కార్యదర్శి జేఎస్పీ రాజు పాల్గొన్నారు.

విద్యార్థినుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు
అమలాపురం టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు అమలులో ఉన్నాయని ఐసీడీఎస్ అధికారిణి విజయశ్రీ పేర్కొన్నారు. మహిళా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం అమలాపురం శ్రీవెంకటేశ్వరా డిగ్రీ కళాశాలలో బేటీపడావో.. బేటీబచావో కార్యక్రమం నిర్వహించారు. కరస్పాండెంట్ కేవీఆర్ఎస్ నరసింహారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజయశ్రీ ముఖ్య అతిథిగా మాట్లాడారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా చదువులో రాణించాలన్నారు. ఎవ్వరికైనా వేధింపులకు గురవుతుంటే వెంటనే అప్రమత్తమై పోలీసులకు, తల్లిదండ్రులకు సమాచారం అందించి రక్షణ పొందాలన్నారు. లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలని విద్యార్థినులకు సూచించారు. ప్రిన్సిపాల్ కేఎస్‌పీఎస్ మనోహర్, కరాటం ప్రవీణ్, యాలంగి వరప్రసాద్, డాక్టర్ సౌమ్య, డాక్టర్ కె.హేమవిజిత, కె.శ్రావణ్‌దిలీప్, సీలి సంసోను పాల్గొన్నారు.

గోదావరి ఒడ్డున మట్టిని తవ్వేస్తున్నారని ఫిర్యాదు
మామిడికుదురు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పెదపట్నంలంక గ్రామంలో గోదావరి ఒడ్డున కుంపట్ల త్రిమూర్తులు అనే రైతు మట్టిని తవ్వేస్తున్నాడని అదే గ్రామానికి చెందిన కొంతమంది రైతులు గురువారం తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందించారు. గోదావరి ఒడ్డునే జేసీబీ సాయంతో మట్టిని ట్రాక్టర్లతో తరలించుకుపోతున్నారని, దీని వల్ల తమ విలువైన భూములు గోదావరి నదిలో కలిసిపోయే ప్రమాదం ఉందన్నారు. మట్టి తీసేవారిపై చర్యలు తీసుకుని, భూములను రక్షించాలన్నారు. గుండాబత్తుల గోవిందరావు, జీఎస్వీవీ ప్రసాద్, వీవీవీఎస్‌రావు పాల్గొన్నారు.

రక్త పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయాలి
మలికిపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పుట్టగొడుగుల్లా వెలుస్తున్న రక్త పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయాలని జిల్లా వినియోగదారుల సంక్షేమ సంగాల సమాఖ్య ఉపాధ్యక్షుడు మాలే శ్రీనివాసనగేష్ అన్నారు. నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి పరీక్షా కేంద్రాల్లో సరైన ప్రమాణాలతో ఫలితాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. కొన్ని పరీక్షా కేంద్రాల్లో ఎంఎల్టీ, డీఎంఎల్టీ అర్హతలు లేకుండానే పరీక్షలు చేస్తున్నారని అన్నారు. జిల్లా వైద్యశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి రెన్యువల్ కాని వాటిని కూడా గుర్తించాలని కోరారు.

షిర్డిసాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ
అల్లవరం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నం మహాలక్ష్మమ్మ గుడి సెంటర్‌లో నూతనంగా నిర్మించిన ఆలయంలో బుధవారం సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ సామూహిక సాయి సత్యవ్రతాలు, హోమపూజలు వేడుకగా జరిగాయి. షిర్డిసాయి ఆలయ ప్రాంగణం సాయినామస్మరణలతో మార్మోగాయి. గునిశెట్టి రోహిణీకుమార్, శ్యామలా దంపతులు, కొమ్మూరి సత్తిబాబు-వసంతలక్ష్మి దంపతులు కర్తలుగా ప్రతిష్ఠ పూజలు జరిగాయి. అమ్ముల సాంబశివరావు నేతృత్వంలో సాయిరుత్విక్, హెచ్ఎస్ఎస్ మూర్తి సాయిసత్సంగ ప్రవచనాలు భక్తులను ఆధ్యాత్మిక పరవసులను చేశాయి. గురువారం పూర్ణాహుతి, మోమాలతో పాటు విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ పూజలు జరుగుతాయని షిర్డిసాయి ఆలయ కమిటీ తెలిపింది.

టీచర్ ఫెడరేషన్ హర్షం
ఐ.పోలవరం, మార్చి5(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఏపీ టీచర్ ఫెడరేషన్ బలపరిచిన గాదె శ్రీనివాసులునాయుడు గెలుపుపై ఫెడరేషన్ నాయకులు హర్షం వ్యక్తంచేశారు. కూటమి పాలనలో బదిలీల హడావిడి తప్ప ఉద్యోగులకు ఒరిగిందేమీలేదన్నారు. కూటమి ప్రభుత్వ గత ప్రభుత్వ బాటలోనే నడుస్తోందనడానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఫలితమే నిదర్శనమన్నారు. బదిలీల్లో రెండేళ్ల నిబంధన తొలగించి జీరో సర్వీస్‌తో బదిలీలు చేపట్టాలని ఏటీఏఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఎన్ మునీశ్వరరావు, యూవీ వెంకట్రావు, రాష్ట్ర కౌన్సిలర్ జీవీవీ సత్యనారాయణ కోరారు.

ఎమ్మెల్సీ విజయానికి కృషిచేసినందుకు కృతజ్ఞతలు
మామిడికుదురు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం విజయానికి కృషిచేసిన కూటమి నాయకులు, కార్యకర్తలకు, మైనార్టీ నాయకులకు మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ముఖ్రం హుస్సేన్, మామిడికుదురు సర్పంచ్ గౌస్ మొహిద్దీన్‌లు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం నగరంలో వారు విలేకరులతో మాట్లాడారు. రాజశేఖరం విజయానికి సహకరించిన పట్టభద్రుల ఓటర్లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మైనార్టీ నాయకుడు షంషూసాదిక్, అబ్రార్‌హుస్సేన్, ఎంకే అబ్బాస్, టీడీపీ ఎస్సీసెల్ నాయకులు కొల్లాబత్తుల వెంకటరమణ, కరం అలీ తదితరులు పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్ పరిశీలన
ముమ్మిడివరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం బళ్ల గేటు సెంటర్‌లోని అన్న క్యాంటీనును ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ భోజనం చేస్తున్న వారిని క్యాంటీను నిర్వహణ ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. రుచికరమైన భోజనం అందిస్తున్నారా అని వారిని ప్రశ్నించారు. ఆహార పదార్థాలను ఆయన రుచి చూశారు. పరిశుభ్రత పాటించాలని, నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని ఆయన నిర్వాహకులకు పలు సూచనలిచ్చారు. రిజిస్టర్‌ను పరిశీలించారు.

వంద రోజులు పని కల్పించాలి
అల్లవరం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి కూలీల కుటుంబాలకు వంద రోజులు పని కల్పించేలా చూడాలని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ అన్నారు. బుధవారం అల్లవరంలో ఉపాధి హామీ ఫీల్డు అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే ఉపాధి పనులపై శ్రద్ధ చూపాలని, వేసవిలో పంటకాల్వలు కట్టిన వెంటనే గుర్రపుడెక్క, తూడు తొలగించి రైతులకు ప్రయోజనం కలిగించాలని ఆదేశించారు. ఏపీవో వి.శ్రీనుబాబు, టెక్నికల్ అసిస్టెంట్ అనిల్‌బాబు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పిల్లలకు వ్యాక్సిన్ తప్పనిసరి
అంబాజీపేట,మార్చి5(ఆంధ్రజ్యోతి): పిల్లలు వ్యాధులు బారిన పడకుండా సమయం ఆధారంగా వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేయించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సత్యనారాయణ పేర్కొన్నారు. అంబాజీపేట ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. తొలుత అంబాజీపేట, మాచవరం, తొండవరం గ్రామాల్లో జరుగుతున్న యూనివర్సల్ ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. చిన్నారులకు వేసే టీకాలు పట్ల అవగాహన కల్పించాలన్నారు. రికార్డులను పరిశీలించారు. వైద్యాధికారి కేఎన్ శ్రీనివాస్, సీహెచ్‌వో బి.అప్పారావు, హెల్త్‌సూపర్‌వైజర్ ఎన్.మధుబాబు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన
మలికిపురం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): 2012లో కాంట్రాక్టు పద్ధతిలో నియమితులైన సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరుతూ బుధవారం పడమటిపాలెంలో ఉద్యోగులు నిరసన చేపట్టారు. అరకొర జీతాలతో హైస్కూల్స్‌లో క్రాఫ్ట్, డ్రాయింగ్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నామని, ఉద్యోగ భద్రత కల్పించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. నిరసనలో జె.చక్రపాణి, బి.రామకృష్ణ, ఎ.నాగదేవి పాల్గొన్నారు.

బాణసంచా పేలుడులో నలుగురికి గాయాలు
కాట్రేనికోన, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం విజయానికి సంబరాలు చేసుకుంటున్న సమయంలో చెయ్యేరులో మంగళవారం సాయంత్రం బాణసంచా పేలి నలుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను అమలాపురం ఆసుపత్రికి తరలించారు.

కారును ఢీకొట్టిన లారీ
కాట్రేనికోన, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బుధవారం కాట్రేనికోన నుంచి పల్లంకుర్రు వైపు వెళ్తున్న లారీ అమలాపురం వైపు వెళ్తున్న మారుతీకారును ఢీ కొట్టింది. అయితే కారులో ఉన్న వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. కారు వేగంగా వెళ్లడంతో ప్రమాదం జరిగినట్టు ప్రత్యక్ష సాక్షుల కథనం. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి
ముమ్మిడివరం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): చికిత్సపొందుతూ వ్యక్తి మంగళవారం రాత్రి మృతిచెందాడు. అయినాపురానికి యిళ్ల సూర్యవెంకటనాగమల్లేశ్వరరావు మామిడికుదురు జూనియర్ కళాశాలలో రికార్డు అసిస్టెంటుగా పనిచేస్తున్నాడు. గత గురువారం సాయంత్రం విధులు ముగించుకుని మోటారుసైకిల్‌పై ఇంటికి వస్తుండగా బొండాయికోడు వద్ద ఆటో ఢీకొనడంతో గాయపడ్డాడు. అతడిని కాకినాడ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడికి గాయాలు
ముమ్మిడివరం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ రాజుపాలేనికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు చింతక్రింద రామకృష్ణ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం రాజమహేంద్రవరంలో దుస్తులు కొనుగోలు చేసేందుకు వెళుతుండగా కొత్తపేట సాయిబాబా గుడి సెంటర్‌లో కుక్క అడ్డురావడంతో మోటార్‌సైకిల్ అదుపు తప్పింది. ఈసంఘటనలో రామకృష్ణ తీవ్రంగా గాయపడడంతో రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రామకృష్ణ ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ఆసుపత్రి వర్గాలు పేర్కొంటున్నాయి.

ఇంటర్మీడియట్ విద్యార్థినికి అస్వస్థత
ముమ్మిడివరం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్ష రాస్తున్న విద్యార్థిని తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో ముమ్మిడివరం అర్బన్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సేవలందించారు. ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లికి చెందిన మహాదశ చందన ముమ్మిడివరం తారా కళాశాల సెంటర్‌లో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్ష రాసేందుకు బుధవారం హాజరైంది. కడుపునొప్పి, వాంతులతో తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో అర్బన్ పీహెచ్‌సీకి తరలించగా అక్కడ ఉన్న కిమ్స్ ట్రైనీ డాక్టర్లు పర్ణిక, సత్యనారాయణ, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ బి.సంపూర్ణలు ప్రాథమిక వైద్యసేవలు అందించారు. సమాచారాన్ని తల్లిదండ్రులకు అందించారు. తల్లిదండ్రులు వచ్చి ఆమెను ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యసేవలు చేయించారు. ఆమె కోలుకున్న తరువాత 11.45గంటలకు పరీక్షా కేంద్రానికి వచ్చి పరీక్ష రాసింది.

రెండు రోజుల్లో సర్వే పూర్తి చేయాలి
ఉప్పలగుప్తం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వర్క్ ఫ్రం హోమ్ సర్వే కార్యక్రమాన్ని రెండు రోజుల్లో పూర్తి చెయ్యాలని అమలాపురం ఆర్డీవో కె.మాధవి, ప్రత్యేక అధికారి రాంబాబు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఉప్పలగుప్తంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు సమావేశం నిర్వహించారు. వర్క్ ఫ్రం హోమ్‌కు అర్హులను గుర్తించేందుకు ప్రారంభమైన ఇంటింటి సర్వే వేగవంతం చెయ్యాలని సూచించారు. ఆయా కుటుంబాల్లో వ్యక్తుల నైపుణ్యతను గణనలోకి తీసుకోవడం ద్వారా ప్రభుత్వ లక్ష్యాన్ని సఫలీకృతం చేసేలా కృషి చెయ్యాలని ఉద్యోగులను కోరారు. సర్వేకు సంబంధించి పలు అంశాలపై అవగాహన కల్పించారు.



వాడపల్లి వెంకన్న ఆలయంలో స్వామివారి దర్శనం చేసుకున్న గుజరాత్ భక్తులు

వాడపల్లి ఆదాయం రూ.1.50 లక్షలు

ఆత్రేయపురం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.1,50,643 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

మహిమగల స్వామి: వాడపల్లి వేంకటేశ్వరస్వామి మహిమగలవారని గుజరాత్‌కు చెందిన భక్తులన్నారు. బుధవారం గుజరాత్ నుంచి వచ్చిన సుమారు 30 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. ఎర్ర చందన స్వరూపుడైన శ్రీవారి చరిత్రను తెలుసుకుని దర్శించుకోవడానికి వచ్చినట్లు వారు తెలిపారు. శ్రీనివాస గోవిందా...శ్రీవేంకటేశ గోవిందా అంటూ కీర్తిస్తూ స్వామివారిని వారంతా దర్శించుకున్నారు.



స్వచ్ఛ మండపేట ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్‌తో పాటు ప్రజలు, మెప్మా సిబ్బంది

స్వచ్ఛ మండపేటగా తీర్చిదిద్దేందుకు కృషి

మండపేట, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండపేటను స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. బుధవారం పట్టణ ప్రజలతో పాటు, మెప్మా సిబ్బందితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ శ్రీనివాస్, ఏఈల అంజనేయులు, పవన్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, మెప్మా సీఎంఎం సుజాత, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ఆత్రేయపురం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నిర్వహించారు. వేద పండితుడు సూర్యనారాయణాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు ఘనంగా జరిపారు. ఉదయం స్వామివారికి మేలు కొలుపు, అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. నిర్మాణ కర్తలు పాతపాటి వెంకట సత్యనారాయణరాజు, రాజ్యలక్ష్మి దంపతులు స్వామివారికి రజిత పంచపాత్రలు అందించారు. మృత్సంగ్రహణం, అంకురార్పణ, అగ్నిప్రతిష్టాపన, వాస్తు హోమం, ధ్వజారోహణ తదితర కార్యక్రమాలను వైభవంగా జరిపారు. రాత్రి మిరుగొట్టు గొలిపే బాణసంచా కాల్పులు, గోవింద నామస్మరణ మధ్య శ్రీవారి శేషవాహన సేవ పండుగగా జరిపారు. బ్రహ్మోత్సవాలలో వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



బ్రహ్మోత్సవ పూజలు చేస్తున్న దృశ్యం

జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో లక్షతులసి పూజలు



లక్షతులసి పూజను చేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో బుధవారం స్వామివారికి లక్షతులసి పూజను నిర్వహించారు. కల్యాణ వేదిక వద్ద స్వామివారిని విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అష్టోత్తర, శతకలశ పూజ, విశేష అభిషేకం, బాలభోగం, తులసీ పూజ, శాంతి హోమం, శాంతి కల్యాణం తదితర కార్యక్రమాలను వేద పండితులు, అర్చక బృందం నిర్వహించారు. ఆలయ ఈవో బీహెచ్వీ రమణమూర్తి దంపతులు స్వామివారి పూజల్లో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది.

నూకాంబిక ఆలయానికి విరాళం

అలమూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆలమూరుకు చెందిన పారిశ్రామికవేత్త వంటిపల్లి కాశీవిశ్వనాథం, కాశీఅన్నపూర్ణ దంపతులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. బుధవారం ఆలయ ఈవో వుండవల్లి వీర్రాజుచౌదరి, ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్లు వైట్ల శేషుబాబు, డి.రామకృష్ణ, ఆలమూరు పీఎసీఎస్ అధ్యక్షుడు వంటిపల్లి సతీష్‌కుమార్, గణేష్ సమక్షంలో వారు విరాళం అందించారు.

ఆలయ హుండీ లెక్కింపు: నూకాంబిక ఆలయ హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వుండవల్లి వీర్రాజుచౌదరి ఆధ్వర్యంలో జరిగిన హుండీ లెక్కింపులో పలువురు భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. హుండీ లెక్కింపులో రూ.5,17,473ల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో వీర్రాజు తెలిపారు.



చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయానికి విరాళం ఇస్తున్న దాతలు

చెత్త నుంచి సంపద సృష్టించాలి

రాయవరం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్త సేకరణ ద్వారా సంపద సృష్టించాలని ఈవోపీఆర్డీ కె.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఈవోపీఆర్డీ మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, క్లాప్ మిత్రలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పల్లెటి వెంకటరత్నం, మండలంలోని 12 గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, క్లాప్ మిత్రాలు పాల్గొన్నారు.



సోమేశ్వరంలో తడిపొడి చెత్త వేరుచేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మేలైన పద్ధతులతో అధిక దిగుబడులు

కపిలేశ్వరపురం, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : మేలైన వ్యవసాయ పద్ధతులతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి రమేష్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని నల్లూరులో రైతు పిల్లి గోవింద పొలం వద్ద మేలైన వ్యవసాయ పద్ధతులపై జీఏపీ పొలంబడి నిర్వహించారు. వరి పంటపై రైతులు ఎదుర్కొంటున్న సుడిదోమ జీవిత చక్రాన్ని ఆయన తెలిపారు. వాటి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు బి.యామినీదేవి, ఆంధ్ర ప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ పి.దిలీప్, పిల్లి మురళీకృష్ణ, నలమాటి విశ్వనాథం, పెనుమర్తి చిన్నబ్బాయి, సూరంపూడి వెంకట్రావు, పలువురు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



సుడిదోమ నివారణపై రైతులకు వివరిస్తున్న ఏవో రమేష్





గత ప్రభుత్వ హయాంలో అధ్వానంగా ఉన్న కొత్తూరు-వెదురుమూడి రోడ్డు. పక్క చిత్రంలో ఇటీవల మరమ్మతులు చేసిన దృశ్యం

కూటమి వచ్చింది..రోడ్డు పడింది

- గత ప్రభుత్వ హయాంలో వాహనదారుల అవస్థలు
- ఇటీవల రోడ్డు మరమ్మతులతో హర్షాతిరేకాలు

అలమూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర రహదారులను నిర్లక్ష్యం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా రోడ్లు సరిగా లేక వైసీపీ హయాంలో వాహనదారులు, ప్రజలు ఎన్నో ఇబ్బందులుపడ్డారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇటీవల రాష్ట్రంలోని ఆయా రహదారులకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నారు. ఆలమూరు మండలం కొత్తూరు నుంచి వెదురుమూడి వెళ్లే రహదారి భారీ గుంతలతో ప్రయాణికులు, వాహనదారులు ఎన్నో ఇబ్బందులుపడ్డారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్లకు నిధులు మంజూరు చేయడంతో అధ్వానంగా ఉన్న ఆయా రోడ్లకు మోక్షం కలుగు తోంది. అధికా రులు యుద్ధ ప్రాతిపదికన ఆయా రోడ్లను మరమ్మతులు చేస్తుండటంతో వాహనదారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆత్రేయపురం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన పాలంగి గన్నిబాబు (38) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు తీర్చలేక మనోవేదనకు గురై 1న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కొత్తపేట ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.



సత్యసూర్య బ్యాంకర్స్ ఎదుట ఆందోళన జరుపుతున్న ఖాతాదారులు

సత్యసూర్య బ్యాంకర్స్ లాకర్లను తెరచిన పోలీసులు

కొత్తపేట, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మెయిన్ రోడ్డులోని సత్యసూర్య బ్యాంకర్స్ నిర్వాహకుడు కె.హేమంత్‌కుమార్ పరారై నెలరోజులు కావస్తున్న విషయం తెలిసిందే. బుధవారం ఈ కేసుకు సంబంధించి రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో బ్యాంకర్స్ లాకర్లను తెరిచారు. ఇది తెలుసుకున్న ఖాతాదారులు పెద్దఎత్తున చేరుకుని నిరసన తెలపగా, కొద్దిసేపు ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఖాతాదారులు తాకట్టు పెట్టిన బంగారం, వెండి వస్తువులు, రికార్డులతో హేమంత్‌కుమార్ పరారైనట్లు దర్యాప్తులో తెలిసింది. లాకర్లు తెరిచినప్పటికి చిన్నపాటి వెండి వస్తువులు మాత్రమే ఉంచినట్లు గుర్తించారు. ఖాతాదారులు ఆందోళన చెందవద్దని నిర్వాహకుడు పరారైనప్పటికి లైసెన్సుదారుడు అందుబాటులో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని రికార్డులు అందిన వెంటనే వినియోగదారులందరికి న్యాయం జరుగుతుందన్నారు. ఎస్ఐ సురేంద్ర మాట్లాడుతూ నిర్వాహకుడి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని తెలిపారు.



విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందిస్తున్న దృశ్యం

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత

ద్రాక్షారామ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు కాకినాడ రోటరీ క్లబ్ కార్యదర్శి తాడాల బుజ్జి పరీక్షా సామగ్రి అందించారు. బుధవరం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు వాటిని అందించారు. కార్యక్రమంలో ఎంఈవో వి.నాగేశ్వరి, హెచ్ఎం రత్న పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మండపేట, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం మారేడుబాకలో రేషన్ బియ్యం దాచి ఉంచారన్న అందిన సమాచారం మేరకు రాజమహేంద్రవరం విజిలెన్స్ అధికారులు బుధవారం దాడిచేసి పట్టుకున్నారు. ఈ దాడిలో రూ.1.28 లక్షల విలువైన రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి ఎంఎస్‌వోకు అప్పగించారు. ఈ దాడుల్లో రేషన్ బియ్యం నిల్వ చేసిన వ్యక్తి వాసంశెట్టి సాయిగా గుర్తించారు. రాజమహేంద్రవరం విజిలెన్స్ సీఐతో పాటు, తహశీల్దార్ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడుల్లో పట్టుబడిన బియ్యాన్ని సీజ్ చేసి స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈ సంఘటనపై మండపేట ఎంఎస్‌వో సి.సూర్యగాయత్రి పద్మ చేసిన ఫిర్యాదుపై పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మహిళా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఐసీడీఎస్ సిబ్బంది

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మహిళా దినోత్సవం

మండపేట, మార్చి 5(ఆంధ్రజ్యోతి) అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థినులకు కెరీర్ గైడెన్స్, బాల్య వివాహాలు, మహిళా చట్టాలపై ఐసీడీఎస్ సీడిపిఓ గజలక్ష్మి తెలిపారు. విద్యార్థినుల పాత్ర కీలకమని ఆమె అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ ఆవశ్యకత వివరించారు. బాల్య వివాహాల నిరోధానికి సంబంధించి వారు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థినులు, నర్సింగ్ విద్యార్థినులతోపాటు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ శ్రీదేవి, సింహాచలం, అంగన్‌వాడీ సిబ్బంది విమల తదితరులు పాల్గొన్నారు.

కేశవరంలో.. మండపేట మండలం కేశవరంలో వున్న దేవుళ్లతాళ్లకాలనీలోనున్న అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పలు అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కో అర్డినేటర్ సత్యనారాయణ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది ఇందిర, ఏఎన్ఎం అనంత, పలువురు ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు

కపిలేశ్వరపురం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నేడు నిర్వహించే పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సమేత గోవిందమాంబ, సిద్దయ్య స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని అంగరలో రెండో రోజు బుధవారం స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. పెద్దాపురానికి చెందిన టి.వీరభద్రాచార్యులు శిష్యులు రామచంద్రపురానికి చెందిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ అర్చకుడు అత్తిలి రామకృష్ణ శిష్య బృందంతో గణపతిపూజ, పుణ్యాహవచనం తదితర పూజలను పలువురు దంపతులతో శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమంలో అంగర, పడమరఖండ్రిక తదితర గ్రామాల భక్తులు, ఆలయ కమిటీ తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న దంపతులు

పట్టభద్రులకు కూటమి ప్రభుత్వంపై నమ్మకం



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ శ్రేణులు

రావులపాలెం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థుల ఘన విజయమని టీడీపీ నాయకులు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించగల శక్తి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు ఉందనే నమ్మకం విద్యావంతులకు ఉందన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థులను భారీ మెజార్టీతో పట్ట భద్రులు గెలిపించారన్నారు. కార్యక్రమంలో నాయకులు గుత్తుల పట్టాభిరామారావు, కంఠంశెట్టి శ్రీనివాసరావు, ముత్యాల బాబ్జి, దర్నాల రామకృష్ణ, కాసా విజయసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు సత్కారం

రావులపాలెం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ఆర్టీసీ డిపోలో వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ డిపో మేనేజర్ రమణ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా డీపీటీవో ఎం.శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. రావులపాలెం డిపో నుంచి కుంభమేళాకు తొమ్మిది ప్రత్యేక బస్సులు నడపగా రూ.30లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ఆదాయం తీసుకువచ్చిన ముగ్గురు కండక్టర్లకు, ప్రతిభ కనబరిచిన ముగ్గురు డ్రైవర్లకు క్యాష్ అవార్డులతో పాటు ప్రశంస పత్రాలను అందించారు. గ్యారేజీలో ఆరుగురు సిబ్బందికి, సెక్యూరిటీ గార్డులకు క్యాష్ అవార్డులు, ప్రశాంస పత్రాలను అందించారు. కుంభమేళాను విజయవంతం చేసిన 14 మంది డ్రైవర్లను సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.

పేరాబత్తుల గెలుపు పట్ల ఎస్టీయూ హర్షం

ఆలమూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో గెలుపొందిన పేరాబత్తుల రాజశేఖర్ గెలుపు పట్ల ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆలమూరులో ఎస్టీయూ నాయకులు ఎస్.వంశీకృష్ణ, దుర్గాప్రసాద్, దాసు, చక్రవర్తి, రాజగోపాల్, సలాది శ్రీనివాస్, కెఎస్ఎన్.మూర్తి, వెంకటేశ్వరరావు, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ పేరాబత్తులకు తమ యూనియన్ పూర్తి మద్దతు తెలిపినట్లు వారన్నారు.

బాల్య వివాహాలు నేరం

కొత్తపేట, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను ప్రోత్సహించడం, చేసుకోవడం చట్టరీత్యా నేరమని పారా సంస్థ రీజనల్ కోఆర్డినేటర్ ఐజయ్య పేర్కొన్నారు. బుధవారం వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథులుగా పారా రీజనల్ కోఆర్డినేటర్ ఐజయ్య, ఐసీడీఎస్ సీడీపీవో అరుణ తదితరులు పాల్గొని బాల్య వివాహాలను చేసుకోవడం నేరమన్నారు. యుక్త వయసులో ఆకర్షితులు కాకుండా చదువుపై దృష్టిపెట్టి ఉన్నత స్థాయికి చేరుకోవాలని వారు తెలిపారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే టోల్ ఫ్రీ నెంబరు 1099కి సమాచారం అందించాలని విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ

మండపేట, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వెలగతోడులో బుధవారం చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారీపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. వెలగతోడు పంచాయతీ కార్యదర్శి వర్మ నేతృత్వంలో జరిగిన శిక్షణలో కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు సంపద తయారీ, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు.



ప్రత్యేక అలంకరణలో పెదవేంకటేశ్వరస్వామి

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

రావులపాలెం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని వేంకటేశ్వరస్వామి 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామివారి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

రేపు మహిళలకు ప్రత్యేక జాబ్‌మేళా

అమలాపురం టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ మహిళలకు 7న వికాస జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని వికాస సంస్థ జిల్లా కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్‌లోని తుక్కుగూడలోని ఫాక్స్‌కాన్ కంపెనీలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగులైన మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. ఈ కంపెనీలో మొబైల్ అసెంబ్లింగ్ యూనిట్‌లో ఆపరేటర్‌గా పనిచేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ తెలిపారు.



శాసనసభ భవనంలో జరిగిన సభలో పాల్గొన్న మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల

అంచనాల కమిటీ సమావేశానికి ఎమ్మెల్యే వేగుళ్ల హాజరు

మండపేట, మార్చి 5(ఆంధ్రజ్యోతి) అమరావతిలో బుధవారం శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన శాసనసభ భవనంలో ప్రజాపద్దుల అంచనాల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సహచర చైర్మన్లు, సభ్యులతో పాల్గొన్నారని పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.



ఎంవీఐ రాజేంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న హరినాథరెడ్డి తదితరులు

ఎంవీఐ రాజేంద్ర ప్రసాద్‌కు సత్కారం

ద్రాక్షారామ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) రాపాక రాజేంద్ర ప్రసాద్‌ను బుధవారం ఆయన కార్యాలయంలో సత్కరించారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది మల్లిడి హరినాధరెడ్డి, చైతన్య కల్చర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొమ్మసాని సత్తిరెడ్డి, కె.సురేష్, పి.వేణుగోపాల్ తదితరులు సత్కరించారు. ఆయన అందిస్తున్న సేవలు కొనియాడారు. కార్యక్రమంలో ఆర్టీవో ఏజెంట్లు, వాహన యజమానులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.